
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 30 మే 2025





కడపలో జరిగిన మహానాడు వేదికపై మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



వింజమూరులో జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



రాపూరు చెక్‌పోస్టు వద్ద జెండా ఊపుతున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి

తమ్ముళ్ల సంబరం

● భారీగా కడపకు తరలిన టీడీపీ శ్రేణులు

కడపలో మహానాడు బహిరంగ సభకు జిల్లా నుంచి తెలుగు తమ్ముళ్లు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పయనమయ్యారు. గురువారం వేకువజాము నుంచే జిల్లావ్యాప్తంగా తెలుగుదేశం శ్రేణుల కోలాహలం కనిపించింది. బుధవారం రాత్రే మహానాడు నుంచి తమ నియోజకవర్గ కేంద్రాలకు చేరుకున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు జన సమీకరణపై దృష్టి సారించారు. అర్ధరాత్రికి ప్రత్యేక వాహనాలు, ఆర్టీసీ బస్సులు కేటాయించిన గ్రామాలకు చేరుకున్నాయి. వేకువ జాము నుంచే పల్లెల్లో తెలుగు పండుగ వాతావరణం కనిపించింది. మండల కేంద్రాల నుంచి నియోజకవర్గ కేంద్రానికి చేరుకున్న వాహనాలను ఎమ్మెల్యేలు జెండాలు ఊపి కడపకు సాగనంపారు. వాటి వెంటే ఎమ్మెల్యేలు కడపకు పయనం అయ్యారు. ఐదేళ్ల కష్టాల తరువాత అధికారంలోకి వచ్చిన ఉత్సాహం తెలుగు దేశం కార్యకర్తల్లో కనిపించింది. అధికార దర్పంతో ప్రత్యేక వాహనాలు ఎక్కి కడప బహిరంగ సభకు తరలివెళ్లారు. జిల్లా నుంచి సుమారుగా 60-70 వేల మంది కార్యకర్తలు మహానాడు బహిరంగ సభకు తరలివెళ్లినట్లు అంచనా.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



బుచ్చిరెడ్డిపాళెం : టీడీపీ శ్రేణులతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ తదితరులు



ఉదయగిరి నుంచి మహానాడుకు తరలుతున్న టీడీపీ శ్రేణులు



మూల్యాంకన లోపాలు.. విద్యార్థులకు శాపాలు

- టెన్త్ జవాబుపత్రాల దిద్దుబాటులో అలసత్వం
- విద్యార్థుల జీవితాలతో ఆటలు
- రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌లో వెలుగులోకి..

కోవూరులోని వశిష్ట పాఠశాలకు చెందిన రామిశెట్టి సాయికుందనకు టెన్త్‌లో అన్ని సబ్జెక్ట్‌లలో 90కిపైగా మార్కులు వచ్చాయి. ఇంగ్లిష్‌లో మాత్రం 34 మార్కులు రావడంతో 489 మార్కులు వచ్చినా ఆ విద్యార్థిని ఫెయిల్ అయ్యింది. మానసికంగా కుంగిపోయిన ఆమెను ఓదార్చిన తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందితో చర్చించి వెంటనే రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రీకౌంటింగ్‌లో ఈ విద్యార్థిని ఫెయిల్ అయిన ఇంగ్లిష్‌లో 93 మార్కులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో సాయికుందన మొత్తం మార్కులు 548 వచ్చాయి.

జిల్లాలోని మరో విద్యార్థిని జి.మోక్షితకు సాంఘిక శాస్త్రంలో 84 మార్కులు రావాల్సి ఉండగా 21 వేసినందుకు స్పాట్ సెంటర్‌లో అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన మనుబోలు జడ్పీస్కూల్ ఎస్‌ఏ ఎ.శాంతిని, స్పెషల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించిన కోవూరు మండలం కొత్తూరు ప్రభుత్వ యూపీ స్కూల్ ఎస్‌జీటీ వి.సురేష్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి ఘటనలను ప్రతిసారి జరుగుతున్నా తప్పులను సరిదిద్దే ప్రయత్నాలు మాత్రం జరగకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారు. సందేహాలతో రీ వెరిఫికేషన్ చేయించుకుంటున్న వారికి పదుల సంఖ్యలోనే మార్కులు పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇవన్నీ మూల్యాంకన విధులు నిర్వహిస్తున్న విద్యాశాఖ సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

నెల్లూరు (విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది టెన్త్ ఫలితాల్లో ప్రతిభ కలిగిన పలువురు విద్యార్థులకు మార్కులు తక్కువ రావడంతో సందేహించి రీవాల్యూయేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థులకు పంపిన జవాబు పత్రాలను పరిశీలించగా వాటిలో జవాబులను అసలు మూల్యాంకనం కూడా చేయకుండా వీరు రాసిన జవాబులే తప్పని నిర్ధారిస్తూ రెడ్‌ఇంక్ పెన్‌తో జవాబులను నిలువునా కొట్టివేశారు. మూల్యాంకన విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ఇలాంటి ఘటనలకు పాల్పడటం, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం ఏమిటని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూల్యాంకన సమయంలో అసిస్టెంట్ ఎగ్జామినర్ జవాబుపత్రాన్ని మూల్యాంకనం చేసిన తరువాత ర్యాండమ్‌గా ఎగ్జామినర్ వాటిని పరిశీలించి ఆయా ప్రశ్నలకు సరైన మార్కులు వేశారా లేదా అన్నది పరిశీలిస్తారు. మూల్యాంకనం జరిగిన ప్రతి జవాబు పత్రాన్ని కూడా స్క్రూటినైజర్ పరిశీలించి అసిస్టెంట్ ఎగ్జామినర్ జవాబుపత్రంలో నమోదు చేసిన మార్కులను లెక్కించి నిర్ణీత బాక్సుల్లో ప్రశ్నల వారీగా నమోదు చేస్తారు. ఈ ప్రకియ మొత్తం ముగ్గురు బాధ్యతాయుతమైన ఉపాధ్యాయుల నడుమ సమన్వయంతో జరుగుతుంది.

● బాధ్యులెవరు.. చర్యలేమిటి!?

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నా వీరిపై మాత్రం ఎలాంటి చర్యలు ఉండటం లేదు. జవాబుపత్రాలు సరిగా పరిశీలించకుండా అన్నీ సరిగా ఉన్నా వాటిని తప్పులుగా కొట్టివేయడం, తమకు నచ్చిన వాటికి మార్కులు వేయడం తదితర ఘటనలతో అర్హులైన విద్యార్థులు నష్టపోతున్నారు. ఇలాంటి ఘటనలు కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తుండగా ఎన్నో మరుగున పడిపోతున్నాయి. వెలుగులోకి వచ్చిన తప్పునకు తాము బాధ్యులం కాదంటూ ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ

- మిగతా 7లో..

సెలవులో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ పదిహేను రోజులపాటు సెలవులోకి వెళ్లారు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం సెలవు కోసం ఆయన ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు. కాగా ఇన్‌చార్జ్ కలెక్టర్ బాధ్యతలను జేసీ కార్తీక్‌కు అప్పగించారు.

ఉపాధ్యాయ పదోన్నతులకు ఎదురుచూపులు

- వివరాలు 7లో..



వచ్చే నెల 15 నుంచి వెంగమాంబ బ్రహ్మోత్సవాలు

ఉత్సవాల్లోనైనా వసతులు కల్పిస్తారా!?

నేడు సమన్వయ కమిటీ సమావేశం

ఉదయగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాల కల్పనపై ఆలయ ఆవరణలో కావలి ఆర్డీవో వంశీకృష్ణ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం జరగనుంది. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఆంధ్రాతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ ఉత్సవాలకు తరలివస్తారు. అయితే, వ్యయ ప్రయాసలు పడి వచ్చే భక్తులకు వసతుల కల్పనలో మాత్రం అధికార యంత్రాంగం విఫలమవుతూనే ఉంది. ఈ ఏడాదైనా అన్ని సౌకర్యాలు కల్పించి అమ్మవారి దర్శనం సజావుగా జరిగేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

● ఉత్సవాల సమయంలో పూజా సామగ్రి, కొబ్బరికాయ, ఎండుకొబ్బరి, ఇతరత్రా వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తుంటారు. ఫిర్యాదులు అందుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

● ఇక మద్యం విక్రయాలకు అడ్డూ అదుపు లేదు. ఎక్కడపడితే అక్కడ అధిక ధరలకు మద్యం అమ్ముతుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఉత్సవాల వేళ మద్యం విక్రయాలను నిరోధించాల్సి ఉంది.

● అమ్మవారి లడ్డూ ప్రసాదంలో నాణ్యత తగ్గుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రద్దీ దృష్ట్యా అవసరమైన ప్రాంతాల్లో మంచినీటి సదుపాయం కల్పించాలి.

● బ్రహ్మోత్సవాల చివరి రెండు రోజుల్లో భక్తుల తాకిడి అధికం. ఆ సమయంలో దొంగతనాలు విపరీతంగా జరుగుతుంటాయి. దీనికి తోడు జూద స్థావరాలు పుట్టగొడుగుల్లా వెలుస్తాయి. వాటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● అమ్మవారి దర్శనానికి వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలి. అలాగే మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి.

'ఇరిగేషన్'లో బిల్లుల గోల

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అంటే ఇదేనేమో.. అసలే బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వం ఎల్‌వోసీ ఇచ్చినా దానిని ఉపయోగించుకోలేకపోతున్నారు. ఆ బడ్జెట్ మొత్తం తమదేనంటూ ఓ కాంట్రాక్టర్ అంటే.. కాదు.. మాకూ భాగముందని మరో కాంట్రాక్టర్ ఎదురుతిరుగుతున్నారు. పెన్నార్ కెనాల్ సిస్టమ్‌కు ప్రభుత్వం ఇచ్చిన రూ.17.50 కోట్ల ఎల్‌వోసీ (బడ్జెట్ కేటాయింపులు) చుట్టూ వివాదం జరుగుతోంది. ప్రభుత్వం బడ్జెట్ ఇచ్చి పది రోజులు గడిచినా ఇంతవరకూ ఒక్క బిల్లు కూడా అప్‌లోడ్ చేయలేదు. రెండు కీలక వర్కులకు సంబంధించిన కాంట్రాక్టర్ల మధ్య సఖ్యత కుదరక ఈ పంచాయితీ మంత్రుల వద్దకు చేరినట్లు తెలుస్తోంది.

8

భలే భలే బంగినపల్లి!

ఊపందుకున్న మామిడిపండ్ల మార్కెట్ ● వర్షాలకు ఒక్కసారిగా కోతకు వచ్చిన కాయలు

ఉలవపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి) : బంగినపల్లి మామిడి ఆరగిద్దామని ఎదురుచూసే ఫలరాజుప్రియుల కోరిక తీరుతోంది. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు, మధ్య మధ్యలో ఎండ వేడికి బంగినపల్లి త్వరితగతిన పక్వానికి వచ్చింది. ఉలవపాడులోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని ఖాళీ స్థలంలో పండు మామిడి మార్కెట్ మొదలైంది. సహజంగా మే నెల మూడో వారం నుంచి అడపాదడపా ముందస్తు మామిడి కోతకు వస్తే ఆటోల్లో మార్కెట్‌కు తరలించి సాగుదారు వ్యాపారం సాగించేవాడు. అయితే, ఈసారి మాత్రం రోజు మార్చి రోజు వర్షం కురవడం, ఒక్కోరోజు పగలు ఎండ తీవ్రత అధికంగా ఉండటం వెంటనే రాత్రిపూట వర్షం కురవటంతో మామిడి ముందస్తు పంట దశకు చేరింది. దీంతో చెట్టుకు పండిన కాయలు దిగుమతికి వస్తున్నాయి. మార్కెట్‌లో కిలో లెక్కన కాకుండా ట్రేల లెక్కన అమ్మకాలు జరుపుతుంటారు. ఒక్కో ట్రేలో పెద్ద సైజు బంగినపల్లి మామిడి 40 కాయలు వరకు పడతాయి. మధ్యస్థ సైజు కాయలు 50 పట్టే అవకాశం ఉంది. నాణ్యతను బట్టి ఒక్కో ట్రే ధర ప్రస్తుతం రూ.600 నుంచి 800 వరకు విక్రయిస్తున్నారు.



ఇతర ప్రాంతాల నుంచి ఉలవపాడు మార్కెట్‌కు వస్తున్న బేరగాళ్లు

● పక్క జిల్లాల బేరగాళ్లు

తోటల్లో పక్వానికి వచ్చిన బంగినపల్లి మామిడి ఎగుమతికి అవకాశం లేనందున ఉలవపాడు చుట్టుపక్కల మండలాల నుంచి ప్రతిరోజు పదుల సంఖ్యలో ఆటోల్లో మార్కెట్‌కు తరలిస్తుంటారు. మే మూడోవారం మొదలు పండు మామిడి మార్కెట్ సీజన్ మొదలవుతుందని తెలిసిన ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల నుంచి రోజువారి బేరగాళ్లు ఉలవపాడులో మకాం మారుస్తారు. పగలంతా వ్యాపారం చేయడం రాత్రికి పక్కనే ఉన్న సాయిబాబా మందిరం ప్రాంగణంలో వసతి పొందుతున్నారు. ప్రతిరోజు తెనాలి, బాపట్ల, చీరాల, వేటపాలెం, ఒంగోలు మీదగా ఉలవపాడుకు వచ్చే ప్యాసింజర్ రైలులోనూ మహిళా వ్యాపారులు వచ్చి తమకు కావాల్సిన సరుకును కొనుగోలు చేసి తిరిగి ప్యాసింజర్ రైలులోనే వెళుతుంటారు. సుమారు రెండు నెలలపాటు ఇదేవిధంగా పక్క జిల్లాల బేరగాళ్లు వస్తుంటారు.

వర్షం కురిస్తే కుదేలే

బంగాళాఖాతంలో అల్పపీడనం అని వాతావరణ శాఖ ప్రకటన మామిడి రైతుల్లో ఉన్న కొద్దో గొప్పో ఆశ నీరుకార్చేలా ఉంది. ఇప్పటికే పడిన వర్షానికి కాయల నాణ్యత దెబ్బతినడం, చెట్లనే పండిపోవడం వంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇంతటితోనైనా వర్షం బెడద లేకుంటే మామిడి ధర పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశతో ఉన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్ టన్ను బంగినపల్లి మామిడి రూ.40 వేలు ఉండగా, గతేడాది ఇదే సీజన్‌లో 65వేల వరకు విక్రయించారు.



ఉలవపాడు ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని మామిడిపండ్ల మార్కెట్



ఎడాదికి ఒకసారి.. విరబూసే అందాలు!

పుష్పాలు అంటేనే అందంతో మిళితమై పరిమళ సువాసనలు వెదజల్లుతాయి. ప్రకృతిప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. కొన్ని పూలు సంవత్సరం పొడవునా పూస్తుండగా, ఇంకొన్ని మాత్రం ఒకసారి మాత్రమే పూస్తాయి. అలాంటి కోవకు చెందినవే మే పుష్పాలు. బోగోలు మండలం కడనూతల గ్రామంలో బీ.జయకుమార్ మాస్టారు ఇంట్లో బూసిన 'మే' పుష్పాలను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)

ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెల 1వతేదీన అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఈనెల 31న అందించనున్నారు. 1వ తేదీ ఆదివారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 31న ఉదయం 7గంటలకు సచివాలయ సిబ్బందితోపాటు అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేస్తారు. 1వ తేదీతోపాటుగా జూన్ 2 తేదీన కూడా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 3,04,827 మంది పెన్షనర్లు ఉండగా, రూ.132.39 కోట్లు పంపిణీ చేయనున్నారు. కాగా, కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్లను జూన్ 12వ తేదీన పంపిణీ చేయనున్నారు.

కాకాణిని కస్టడీకి ఇవ్వండి

నెల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు నెల్లూరులోని ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. వారం రోజులపాటు కస్టడీకి అనుమతివ్వాలంటూ అభ్యర్థించారు. కేసు కీలక దశలో ఉన్న నేపథ్యంలో ఏ4 కాకాణిని విచారించాల్సిన అవసరం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై కోర్టు విచారణ జరిపి తుది నిర్ణయం వెలువరించాల్సి ఉంది. కాగా ఇదే సమయంలో కాకాణి తరఫున న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కూడా విచారణ జరగాల్సి ఉంది.

యోగాపై అవగాహన పెంచండి

నెల్లూరు (హరనాథపురం) మే 29 (ఆంధ్రజ్యోతి) : యోగాపై పొదుపు సంఘాల సభ్యులందరూ ప్రజలకు అవగాహన కల్పించాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బీ లీలారాణి సూచించారు. నెల్లూరు పట్టణ సమాఖ్య భవనంలో గురువారం సమాఖ్య ఈసీ మెంబర్లు, ఆర్పీలతో సమావేశం జరిగింది. పీడీ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చు అనేది ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమం లో టీఈ అంకయ్య, సీవో అబ్దుల్ అలీ బేగ్, సురేష్, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు మాధవి పాల్గొన్నారు.



అడవులను పరిశీలిస్తున్న డెహ్రాడూన్ బృందం

వృక్ష సంపద పెరిగిందా.. తరిగిందా!?

ఉదయగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి అటవీ శాఖ పరిధిలోని పలు అటవీ ప్రాంతాలను గురువారం ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా డెహ్రాడూన్ బృందం పరిశీలించింది. బృంద సభ్యులు ఇంతియాజ్‌సీ, పీ.అధికారి స్థానిక అటవీ సిబ్బందితో కలిసి దుత్తలూరు, నందిపాడు, ఉదయగిరి, ఆర్లపడియ, సీతారామపురం బీట్‌లను పరిశీలించారు. ఆయా బీట్‌లలో ఏ ఏ వృక్ష జాతులు ఉన్నాయి, వాటి ఎదుగుదల ఎలా ఉంది, వృక్షాల పెరుగుదల తగ్గిందా, పెరిగిందా తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బృందం వెంట రేంజ్ అధికారి బీఎస్ కుమార రాజా, డీఆర్వో మురళి, ఎఫ్‌బీవోలు ఓంప్రకాష్, చిన్నపురెడ్డి, లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కండలేరు నీటిమట్టం 41.001 టీఎంసీలు

రాపూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తి స్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 41.001 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్ ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 1960 క్యూసెక్కులు, లోలెవల్ సూయిస్ నుంచి 60 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుంచి 20 క్యూసెక్కులు మొత్తం 2040 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో అవుతుందని ఏఈ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9162
వెండి కిలో ధర	రూ. 100.400
వెండి ఒక గ్రాము	రూ. 103.40

టీడీపీలోనే క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు

● ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, మే 29(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ కలిగిన కార్య కర్తలు టీడీపీలోనే ఉంటారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మహానాడుకు నియోజకవర్గం నుం చి నాయకులు, కార్యకర్తలు బుచ్చి నుంచి భారీ ర్యాలీగా తరలివెళ్లారు. 100 కార్లు, 30 బస్సులకు ఎంపీ, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి జెండా ఊపి ప్రారం భించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్ర బాబు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహానాడులో తొలిసారి ఎమ్మెల్యేగా పాల్గొనడంతో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నామన్నారు. నిరంతరం పార్టీ కార్యకర్తల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మురళి, హరికృష్ణ, అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, నాయకులు రామా నాయుడు, వెంకటేశ్వర్లునాయుడు, మల్లారెడ్డి, రాఘవరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● **ఇందుకూరుపేట :** కడప మహా నాడుకు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొన్నగల రంగారావు ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. అలాగే మండల టీడీపీ అధ్యక్షుడు ఏకొల్లు పవన్‌కుమా ర్‌రెడ్డి ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

● **ముత్తుకూరు :** కడపలో మహానాడు కార్యక్రమానికి ముత్తుకూరు మండలం నుంచి గురువారం టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయ కులు బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో మహానాడుకు వెళ్లారు. ముత్తుకూరు, పంటపాలెం, పైనంపురం, బ్రహ్మ దేవం, కృష్ణపట్నం సెంటర్లలో ర్యాలీ నిర్వహించి కార్య కర్తలతో కలిసి మహానాడులో పాల్గొనేందుకు వెళ్లారు.



పొదలకూరు: మహానాడుకు బయలుదేరుతున్న టీడీపీ నాయకులు



కొడవలూరు : యల్లాయపాలెంలో మహానాడుకు బయలుదేరిన టీడీపీ కార్యకర్తలు, ప్రజలు

ఎమ్మెల్యే కురుగొండ్ల ఆధ్వర్యంలో మహానాడుకు తరలిన నేతలు



మనుబోలు నుంచి మహానాడుకు..

● **రాపూరు :** కడపలో మహానాడు కార్యక్రమానికి వెంకటగిరి శాసనసభ్యుడు కురుగొండ్ల రామ కృష్ణ ఆధ్వర్యంలో నుడా చెర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నియోజక వర్గ నాయకులు, మండల నాయకులు, కార్య కర్తలతో కలిసి భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ గంగోటి నాగేశ్వరావు, వెంకటగిరి నియో జకవర్గ పరిశీలకులు జమ్మి రమణయ్య, టిడిపి నాయ కులు చెన్ను అశోక్‌రెడ్డి, మండల నాయకులు నల్లవడ్ల వెంకటేశ్వర్లురెడ్డి, చెన్ను పెంచలరెడ్డి, చంద్రమోహన్ కార్య కర్తలు పాల్గొన్నారు.

● **పొదలకూరు :** కడపలో తెలుగుదేశం పార్టీ మహానాడు సభకు పొదలకూరు నుంచి మండల పార్టీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్‌నాయుడు, ఆదాల సుగుణమ్మ, కోడూరు భాస్క ర్‌రెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, శరత్, పులిపాటి వెంకటరత్నంనాయుడు, కలిచేటి ప్రభా కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్య కర్తలు తరలివెళ్లారు. పొదలకూరు మండలంలోని అన్ని గ్రామాల నుంచి సుమారు 1200 మందికి పైగా టీడీపీ కార్యర్తలు తరలివెళ్లారు.

● **మనుబోలు :** కడపలో టీడీపీ మహానాడుకు మండలం నుంచి భారీగా టీడీపీ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం తరలివెళ్ళారు. మండలకేంద్రమైన మనుబోలులో టీడీపీ తెలుగుయువత నాయకులు పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో ఒక బస్సు, రెండు కార్లలో కార్యకర్తలు వెళ్ళారు. అలాగే కోదండరామ పురంలో గ్రామ అధ్యక్షుడు సాని వెంకటరమణయ్య ఆధ్వ ర్యంలో మరో బస్సు వెళ్ళగా, మండలవ్యాప్తంగా 15బస్సులు, 20 కార్లలో తరలివెళ్ళారు. ఏఎంసీ చైర్మన్ గాలిరామకృ ష్ణారెడ్డి మహానాడుకు జన సమీకరణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. యాచ వరం నుంచి మూడేళ్ల చిన్నారి మెడలో టీడీపీ ట్యాగు వేసుకుని మహానాడుకు వెళ్లడం విశేషం.

● **సైదాపురం :** కడపలో మహానాడు బహిరంగ సభకు మండల టీడీపీ నాయకులు గురు వారం తరలివెళ్ళారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ మహా నాడుకు తరలివెళ్ళేందుకు మండలానికి 10 బస్సులు కేటా యించారు. దీంతో గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా మోహన్ కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి పెమ్మసాని దిలీప్ చౌదరి, మండల నాయకులు అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, కర్నం శ్రీనివాసులు నాయుడు, వరిగొండ సురేంద్ర, కేపీ రాజు, పాములూరి శ్రీనివాసులు నాయుడు, కందాటి విజయ్‌రాఘవరెడ్డి తదితరులు తరలివెళ్ళారు.

● **వెంకటాచలం :** కడపలో తెలుగుదేశం పార్టీ మహానాడు బహిరంగ సభకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ సమన్వయకర్త సోమి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆపార్టీ నేతలు, కార్య కర్తలు, అభిమానులు, సానుభూతిపరులు భారీగా తరలి వెళ్లారు. ఇందుకోసం ప్రత్యేక బస్సులు, కారులు, వ్యాన్లు ఏర్పాటు చేశారు. వెంకటాచలం మండలం నుంచి సుమా రు 2వేల మంది వరకు తరలివెళ్లారు. మండలంలోని చెముడుగుంట నుంచి వాహనాలు బయలుదేరాయి. టీడీపీ మండల నేతలు రావూరి రాధాకృష్ణమనాయుడు, కటంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, చల్లా నాగార్జున్‌రెడ్డి, వల్లూరు రమేష్‌నాయుడు, ఈపూరు మురళీధర్‌రెడ్డి, రావూరి పద్మనాభనాయుడు, మేదరమెట్ల కోదండయనాయుడు, ఆయా గ్రామాల్లోని నేతలు, కార్యకర్తలు తదితరులు వెళ్లారు.

● కొడవలూరు,(ఆంధ్రజ్యోతి) : కడప మహానాడుకు గురు వారం మండలంలోని టీడీపీ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కొడవలూరు, యల్లాయపాలెం, కొత్తవంగళ్లు నుంచి ప్రత్యేక బస్సుల్లో ప్రజలు వెళ్లారు. నాయకులు నాపా వెంకటేశ్వర్లునాయుడు, ఏకొల్లు వంశీ, పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి, కేతా వెంకటరమణారెడ్డి, చెక్కా మదన్, భూలోకం విజయ్‌కుమార్, తదితరులు కార్లలో బయలుదేరివెళ్లారు.

● విడవలూరు, (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అన్నిరంగాల్లో వెనుకబడి పోయిన రాష్ట్ర భవిష్యత్తును గాడిన పెట్టేందుకు సీఎం చంద్రబాబునాయుడు మహానాడును నిర్వహిస్తున్నారని ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి తెలిపారు. విడవలూరు నుంచి గురువారం మహా నాడుకి బయలుదేరిన వాహనాలకు ఆయన జెండా ఊపి సాగనం పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానాడుకి స్వచ్ఛందం గా కార్యకర్తలు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమం లో ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యవోలు సత్యంరెడ్డి, నాయకురా లు చలంచర్ల కామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



సైదాపురం: మహానాడుకు బయలు దేరుతున్న టీడీపీ నాయకులు



వెంకటాచలం: మహానాడు బహిరంగ సభకు తరలి వెళ్తున్న నేతలు



మనుబోలు: బస్సులో విజయసంకేతం చూపుతున్న చిన్నారి

మైనింగ్ అనుమతి కోసం ప్రజాభిప్రాయ సేకరణ

సైదాపురం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలకలపూండ్ల రెవెన్యూ గ్రామం గోకుల బృందావనం సమీపంలో ధన్వి ప్రమోటర్స్ ప్రయివేట్ లిమిటెడ్ మైకా, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ ఖనిజవనరుల ఉత్పత్తి అనుమతుల కోసం గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈసందర్భంగా మైకా గనుల వల్ల స్థానికులకు జీవనోపాధి కలుగుతుందని తెలిపారు. పాఠశాలల అభివృద్ధి, తాగునీటి సదుపాయం కల్పిస్తామని కంపెనీ ప్రతినిధి ఎస్‌కె జాఫర్ స్థానికులకు హామీ ఇచ్చారు. అనంతరం నెల్లూరు ఆర్డీవో నాగ అనూష మా ట్లాడుతూ మైనింగ్ అనుమతి కోసం ప్రజాభిప్రాయ సేకరణలో అభ్యంతరాలు లేకపోవడంతో సర్వే నెంబర్ 804/పి, 806/పి2 లో 32.758 హెక్టార్ల విస్తీర్ణంలో ఖనిజ వనరుల ఉత్పత్తి కోసం నివేదికలు తయారు చేసి ఉన్న తాధికారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పొల్యూషన్ అధికారి అశోక్ కుమార్, తహసీల్దార్ రమాదేవి, ఎన్జీవో లు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో పారిశుధ్య పనులు

వెంకటాచలం, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్వేపల్లి గ్రామంలో గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు సమక్షంలో ఆపార్టీ నేతలు, కార్యకర్తలు సైడ్ కాలువలలో బ్లీచింగ్ చలారు. అనంతరం కాలువల్లో పేరుకుపోయిన మురికి, చెత్తచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో నేతలు పినిశెట్టి మహేష్, సందూరి శ్రీహరి, మణి, షేక్ రహీమ్, అశోక్, మస్తాన్, గిరీష్, చిన్న, చల్లా చెంచయ్య తదితరులున్నారు.

పారదర్శకంగా రీసర్వే నిర్వహించాలి

మనుబోలు, మే 29: రీసర్వేను సర్వేయర్లు, విఆర్‌వోలు పారదర్శకంగా నిర్వహించాలని నెల్లూరు ఆర్డీవో ఎన్ఎస్ అనూష ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిడూరు, బండేపల్లి రెవెన్యూకు సంబంధించిన రీసర్వే ఫైల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్, విఆర్‌వోలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మనుబోలు, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంజీవయ్య కాలనీకి చెందిన పెయింటర్ గోను చందూకుమార్ (45) అనారోగ్యంతో చెన్నైలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీంతో మండల పెయింటర్స్ అసోసియేషన్ నాయకులు మృతుడి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.8,400 మృతుడి భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమళ సురేష్, సంఘం కార్యదర్శి ఎన్ బాబు, హనుమయ్య, ఉదయ్‌రాజ్, సురేష్ పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో ఎమ్మెల్యే చింతమనేని

రాపూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలోని నర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను, ఆంజనేయస్వామిని గురువారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చింతమనేని ప్రభాకర్ ధర్మపత్ని రాధారాణి పేర్లతో రూ.50 వేలు శ్రీవారి శాశ్వత నిత్యాన్నదానం పథకానికి అందచేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.



పెంచలకోనలో ధ్వజ స్తంభం వద్ద నమస్కరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

యోగాతో ఆరోగ్యం

మనుబోలు, మే 29 (ఆంధ్ర జ్యోతి): యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో జలజాక్షి అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఉన్న కమ్యూనిటీ హాలులో మండల స్థాయి యో గాంధ్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో యోగా శిక్షకుడు చెలికం కోటీశ్వరరెడ్డి కార్యదర్శులు, సచివాలయ ఉద్యో గులు, ఇతర అధికారులచే యోగాసనాలు వేయించారు. యోగా ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ, మడమనూరు ఆయుర్వేద వైద్యురాలు జగదీశ్వరి, ఏవో ముజీబున్నీసా తదితరులు పాల్గొన్నారు.

● **విడవలూరు :** ప్రతి రోజూ యోగా చేయటం ద్వారా ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని ఎంపీడీవో నగేష్‌కు మారి తెలిపారు. యోగాంధ్రలో భాగంగా గురు వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవర ణలో యోగా శిక్షణ నిర్వ హించారు. కార్యాలయ సిబ్బందితో కలసి ఎంపీడీవో యోగాస నాలు వేశారు. ఆమె మాట్లాడుతూ యోగాపై ప్రత్యేక పోటీలను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లని సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారు.



యోగాసనాలు ప్రదర్శిస్తున్న కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు

● **వెంకటాచలం :** స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం యోగా శిక్షణ తరగతులు కొనసాగాయి. ఈసందర్భంగా ఎంపీడీవో కల్పనతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వివిధ రకాల యోగాసనాలను ప్రదర్శించారు.

మామిడిపూడిలో మజ్జిగ చలివేంద్రం

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిపూడి గ్రామం ప్రధాన కూడలిలో గురువారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ జక్కా వెంకయ్య వర్ధంతి సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకు లు నక్కా రాధయ్య, నక్కా శ్యాంప్రసాద్, పాల్గొన్నారు.

జక్కా వెంకయ్యకు ఘననివాళి

కోవూరు, మే, 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య 7వ వర్ధంతి సందర్భంగా సీపీఎం నాయకులు, కార్యకర్తలు మండలంలోని గ్రామాల్లో గురువారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బజారు కూడలిలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకురాలు జక్కా శేషమ్మ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నో ఉద్యమాలకు నాయకత్వం వహించిన జక్కా వెంకయ్య పేదల పక్షాన నిలచి పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండవరపు శేషయ్య, బుజ్జయ్య, పెద్దబ్బయ్య, ఎం. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. పాటూరు పల్లిపాళెంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు విజయకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గండవరపు సురేష్ పాల్గొన్నారు.



కోవూరు : జక్కా వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తూ..

● **కొడవలూరు :** సీపీఎం సీనియర్ నాయ కుడు స్వర్గీయ జక్కా వెంకయ్య ఆశయ సాధనకు కృషి చేస్తు న్నామని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గోని దయాకర్ అన్నారు. మండ లంలో నార్తురాజుపాలెం ప్రధాన కూడలి లో ఆయ న వర్ధంతిని పురస్కరించుకుని గురువారం వెంకయ్య చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ చలివేంద్రం నిర్వహించారు. ఆయన వెంట నాయకులు నరసింహులు, తదితరులున్నారు.



కొడవలూరు : జక్కా వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

● **బుచ్చిరెడ్డిపాళెం :** భూ స్వామ్య కుటుంబంలో పుట్టి, పేదలకు భూపంపిణీ కోసం పోరాడిన పేదల పక్షపాతి కామ్రేడ్ జక్కా వెంకయ్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం దామరమడుగులోని డాక్టర్ పుచ్చలపల్లి సుందరయ్య కల్యాణ మండపంలో మాజీ సర్పంచు గరిటి సురేష్ అధ్యక్షతన నిర్వ హించిన జక్కా వెంకయ్య 7వ వర్ధంతిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల వైద్య సేవల కోసం, డాక్టర్ రామచంద్రారెడ్డి ఆసుపత్రి అభివృద్ధికి వెంకయ్య ఎంతో కృషి చేశారన్నారు.ఉదయగిరి నుంచి నెల్లూరు వరకు మత సామరస్యం కోరుతూ పాదయాత్ర చేసిన మహానేత జక్కా వెంకయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముందు జక్కా వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, డాక్టర్ రాజేశ్వరరావు, జిల్లా నాయకుడు వెంకమరాజు, జిల్లా కమిటీ సభ్యుడు గండవరపు శేషయ్య, మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, ఐద్వా కమిటీ నాయకురాలు జక్కా శేషమ్మ, సర్పంచు విజయమ్మ, గరికపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● **కమ్యూనిస్టు ఉద్యమంలో వెంకయ్యది కీలకపాత్ర**

జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో జక్కా వెంకయ్యది కీలక పాత్ర అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి టీవీ. ప్రసాద్ అన్నారు. గురువారం బుచ్చిలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన వెంకయ్య 7వ వర్ధంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సీహెచ్. మల్లికార్జునరావు, మునీర్ అహ్మద్, పీ. శ్రీనివాసులు, జానీబాష, తదితరులు పాల్గొన్నారు.



బుచ్చి : దామరమడుగులో జరిగిన జక్కా వెంకయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పహల్గాం బాధితులను ప్రధాని పరామర్శించరా ?

● జక్కా వెంకయ్య సేవలు మరువలేనివి
● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నెల్లూరు (వైద్యం), మే 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలను ప్రధాని నరేంద్ర మోదీ నేటికీ పరామర్శించ లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పహల్గాం అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించారని, ఇది కేంద్ర ప్రభుత్వ ఇంటలిజెంట్స్ వైఫల్యమే నన్నారు. బాధితులను ఓదార్చాల్సిన మోదీ ఆ ప్రయత్నం చేయకపోవటం సరికాదన్నారు. సీపీఎం నాయకుడు జక్కా వెంకయ్య సేవలు మరిచి పోకూడదన్నారు. ఆయన జిల్లాలో అనేక భూపోరాటాలు, కూలీల సమస్యలపై పోరాటాలు చేసిన నేత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు మాదాల వెంకటేశ్వ ర్లు, అజయ్ కుమార్, గోగుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రి హత్య కేసులో కుమారుడికి జీవితఖైదు

నెల్లూరు (లీగల్), మే 29 (ఆంధ్రజ్యోతి) : వ్యసనాల కోసం డబ్బు ఇవ్వలేదనే కోపంతో తండ్రిని హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో షేక్ తాజుద్దీన్ అనే నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... నెల్లూరు నగరం బుజబుజ నెల్లూరు చెన్నకేశవ నగర్‌కు చెందిన షేక్ మస్తాన్ అలియాస్ బండా మస్తాన్ కత్తులకు సానబడుతూ జీవించేవాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు. మస్తాన్ పక్షవాతానికి గురై బాధపడుతుండేవాడు. అయన కుమారుడు షేక్ తాజుద్దీన్ వ్యసనాలకు బానిసై కుటుంబ సభ్యులను వేధించేవాడు. ఆ బాధ తట్టుకోలేక అయన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. 2021 జూన్ 4వ తేదీన ఇంట్లో మస్తాన్ ఒక్కడే ఉండగా తాజుద్దీన్ వెళ్లి డబ్బు అడిగాడు. మస్తాన్ ఇవ్వకపోవడంతో కత్తితో అతని మెడ కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. చుట్టు పక్కల వారు వచ్చి చూడగా మస్తాన్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఈ నేరంపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడం తో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఇన్‌చార్జి ఏపీపీ సుందరయ్య యాదవ్ వాదించారు.

దోపిడీ దొంగల అరెస్టు

నెల్లూరు(విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా వెళుతున్న వారిని కత్తులతో బెదిరించి నగదు దోపిడీ చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు నవాబుపేట సీఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం స్టేషన్‌లో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. నెల్లూరులోని పాత చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన వెంకయ్యను ఈనెల 28న అరవ అజిత్, షేక్ ఉస్మాల్ అలియాస్ దావూలు అడ్డుకుని కత్తులతో బెదిరించి అతని వద్ద ఉన్న నగదును దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించారు. గురువారం భగత్‌సింగ్ కాలనీ వద్ద వారిని అదుపులోకి తీసుకుని రెండు కత్తులు, నగదు స్వాధీనం చేసుకున్నారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో యువతి ఆత్మహత్యాయత్నం

● హుటాహుటిన వైద్యశాలకు తరలించిన పోలీసులు

ఉదయగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా ఉదయగిరి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఓ యువతి పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండలంలోని జీ.చెర్లోపల్లి పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన బత్తుల శివప్రియ నెల్లూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. అదే గ్రామానికి చెందిన వల్లెపు హరికృష్ణతో నెల్లూరులోనే ఉంటూ కొన్నేళ్లుగా సహజీవనం చేస్తోంది. ఇటీవల హరికృష్ణకు ఓ యువతితో వివాహం నిశ్చయమై వచ్చే నెల 5న నిశ్చితార్థం జరగనుంది. దీంతో శివప్రియ, హరికృష్ణ మధ్య మనస్పర్థలు చోటుచేసుకొన్నాయి. ఈ నేపథ్యంలో హరికృష్ణ వివాహం చేసుకునే యువతికి శివప్రియ ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో కోపోద్రిక్తుడైన హరికృష్ణ వైద్యశాలలో విధి నిర్వహణలో ఉన్న శివప్రియపై కర్రతో దాడి చేశాడు. అక్కడే ఉన్న సిబ్బంది సర్దిచెప్పడంతో అక్కడ నుంచి వెనుతిరిగాడు. మనస్థాపానికి గురైన శివప్రియ స్వగ్రామానికి చేరుకొని తల్లి కొండమ్మతో కలిసి ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లేనందున సాయంత్రం రావాలని అక్కడున్న కానిస్టేబుళ్లు చెప్పారు. ఈ క్రమంలో తెలంగాణలోని వరంగల్‌లో ఉన్న శివప్రియ అన్న నాగార్జున తన తల్లి కొండమ్మకు ఫోన్ చేసి జరిగిన విషయం గురించి మాట్లాడాడు. దీంతో మనస్తాపానికి గురైన తల్లీకూతళ్లు బస్టాండ్ సెంటర్‌లో పురుగుమందు కొనుగోలు చేసి తిరిగి పోలీస్‌స్టేషన్ ఆవరణలోకి వచ్చారు. అక్కడ శివప్రియ ఆ మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన పోలీసులు ఆ యువతిని హుటాహుటిన పోలీసు జీపులో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఆటో

● డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

సంగం, మే 29 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి చెట్టును ఆటో ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని సంగం - కలిగిరి రహదారిలో ఆశ్రమం మలుపు సమీ పంలో గురువారం మధ్యాహ్నం జరిగింది. వివరాల మేరకు... ఏఎస్‌పేటకు చెందిన ఆటో డ్రైవర్ తన ఇద్దరు మనవళ్లను ఎక్కించుకుని సంగంలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఆశ్రమం మలుపు సమీపంలో ముందు వెళ్తున్న ఆటోను ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఆటో ఢీకొంది. దీంతో డ్రైవర్ కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆత్మ కూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్

మనుబోలులో హిజ్రాల వీరంగం

మనుబోలు, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆటో సెంటర్ వద్ద గురువారం హిజ్రాలు వీరంగం సృష్టించారు. గత కొద్ది రోజులుగా మనుబోలుకు హిజ్రాలు వస్తున్నారు. సాయంత్రం వేళ వీరంపల్లి క్రాస్‌రోడ్డు, బద్దెవోలు క్రాస్‌రోడ్డుల వద్ద మోటార్‌సైకిళ్ళు, కార్లు, ఆటోలు నిలిపి డబ్బులు వసూలుచేస్తున్నారు. అలాగే మనుబోలులో దుకాణాల వద్ద, ఆటో సెంటర్‌లో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈక్రమంలో ఆటో సెంటర్ వద్ద హిజ్రాలతో ఆటోడ్రైవర్లు, ప్రయాణికులు తిరగబడడంతో హిజ్రా చెప్పుతో కొట్టేందుకు ప్రయత్నించింది. దీంతో ప్రయాణీకులు, ఆటోడ్రైవర్లు ఎదురుతిరగడంతో హిజ్రాలు వెళ్ళిపోయారు. పోలీసులు స్పందించి గ్రామంలోకి హిజ్రాలు రాకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256
కోడిగుడ్ల ధర (100): 525	



80 బస్సులు, 150 కార్లలో మహానాడుకు...

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వెల్లడి

నెల్లూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడుకు నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి 80 బస్సులు, 150 కార్లలో 6 వేల మంది కార్యకర్తలు హాజరైనట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం మహానాడుకు తరలివెళ్తున్న వారందరికీ ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను ఆయన టీడీపీ నేత గిరిధర్‌రెడ్డితో కలిసి అందించారు. కార్యక్రమంలో చక్రవర్ధన్‌రెడ్డి, మదన్‌కుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లపైనే వ్యాపారం

రాకపోకలకు అసౌకర్యం !





బీవీనగర్‌లో మినీ బైపాస్ రోడ్డుపైనే పాత సామాన్ల వ్యాపారం

ప్రధాన రహదారిపై పుచ్చకాయలు, పండ్ల వ్యాపారం

నగరంలో కొందరు ప్రధాన రోడ్లపైనే వ్యాపారం సాగిస్తున్నారు. పండ్లు, కూరగాయలు, కొబ్బరి బోండాలు, ఆట వస్తువులు, పాత సామాన్లు... ఇలా ఏ వ్యాపారమైనా రోడ్డుపైనే, రహదారి అంచునే నిర్వహిస్తున్నారు. ఇంకొందరు మరో అడుగు ముందుకేసి కర్రలు, పట్టలతో ఏకంగా దుకాణాలే నిర్మించేశారు. దీని వల్ల మెయిన్ రోడ్లపై వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. అసలే నగరంలో వాహనాల సంఖ్య భారీగా పెరిగి ట్రాఫిక్ ఇబ్బందులు, యాక్సిడెంట్లు ఎక్కువవుతున్నాయి. మరింత విశాలమైన రోడ్ల అవసరం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న రోడ్లను కూడా చిరు వ్యాపారులు ఆక్రమించడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్



నక్కలోళ్ల సెంటర్లో రోడ్డుపైకి టెంట్లతో వేసిన దుకాణాలు



అన్నమయ్య సర్కిల్ సమీపంలో మినీబైపాస్ రోడ్డుపై కొబ్బరి బోండాల బండ్లు



హైవేపైనా అదేతీరు..

'రావూస్'లో ప్రాంగణ ఎంపికలు

నెల్లూరు(విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో గురువారం క్యాంపస్ ఎంపికలు జరిగాయి. కళాశాల డైరెక్టర్ శివసంకేత్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ విద్యతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం నిర్వహించిన టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థ డ్రైవ్‌లో 200 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. 105 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

కోమాలోకెళ్లిన యువకుడికి ప్రాణదానం

నెల్లూరు (వైద్యం), మే 29 (ఆంధ్రజ్యోతి): కోమాలోకెళ్లి ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడిని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు అధునిక వైద్య విధానాలతో కాపాడారు. ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ విజయ్‌కుమార్ గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. సూళ్లూరుపేటకు చెందిన సురేష్(23) యాంటీ సైకోటిక్ అనే మాత్రలు అధిక మోతాదులో తీసుకోవటం వల్ల కోమాలోకి వెళ్లాడన్నారు. అత్యాధునిక విధానాలతో బీపీ పల్స్ సాధారణ స్థితికి వచ్చేలా చేశామని, గుండె, కిడ్నీలకు ఎలాంటి ప్రమాదం లేకుండా కాపాడామని, ప్రస్తుతం ఆ యువకుడు పూర్తిగా కోలుకున్నాడని చెప్పారు.

అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిలవనివ్వొద్దు : కమిషనర్

నెల్లూరు(సిటీ), మే 29 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. గురువారం పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా రామలింగాపురం అండర్ బ్రిడ్జి ప్రాంతం, 10, 17 డివిజన్లలో ఆయన పర్యటించారు. బ్రిడ్జిల వద్ద ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా నీటిని తోడేయాలని సూచించారు. అనంతరం సౌర విద్యుత్‌పై కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.

జక్కా వెంకయ్యకు ఘన నివాళి

● వర్ధంతి సందర్భంగా సామాజిక సేవలు



నెల్లూరు రూరల్‌లో జక్కా వెంకయ్యకు నివాళి అర్పిస్తున్న నాయకులు

నెల్లూరు (వైద్యం), మే 29 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య 7వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయనకు పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని ఏసీ నగర్, ఎన్టీఆర్ నగర్, వెంకటేశ్వరపురం, చిన్నబజారు తదితర ప్రాంతాల్లో వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలోని చెరువుల లోతట్టు భూములను జక్కా వెంకయ్య పేదలకు పంచిపెట్టారన్నారు. అనేక రైతాంగ, కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించారని చెప్పారు.

● సీపీఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో నవలాకుల తోట, మూడవ మైలు, అపోలో సెంటర్, ఉమ్మరెడ్డి గుంట, వనంతోపు, సుందరయ్యనగర్, బుజబుజనెల్లూరు, డ్రైవర్స్‌కాలనీ, కొత్తూరు తదితర ప్రాంతాల్లో వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెంచల నర్సయ్య మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల కోసం జక్కా వెంకయ్య చివరి శ్వాస వరకు అవిశ్రాంత పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, బీపీ నరసింహ, మట్టిపాటి శ్రీనివాసులు, అశోక్, తాళ్లూరు భాగ్యమ్మ, కండే కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వెంకయ్య వర్ధంతి సందర్భంగా జీజీహెచ్‌లో రక్తదానం చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గంగాధర్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నమ్మటి శ్రీనివాసులు, షేక్ సందానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

● వెల్లంటిలో రక్తదానం

నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి) : జక్కా వెంకయ్య వర్ధంతి సందర్భంగా రూరల్ మండలం వెల్లంటి గ్రామంలో నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. వెంకయ్యకు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన సేవను కొనియాడి, వెంకయ్య బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు, సర్పంచ్ పాదర్తి రాధ, జనార్దన్, తిరుపాలు, చెంచయ్య, సుబ్రహ్మణ్యం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీపీఎం నగర నాయకులు

రయ్.. రయ్..

ర్యాష్ డ్రైవింగ్

● బైకులతో ఫీట్స్ చేస్తున్న యువత ● నగర రోడ్లపై యథేచ్ఛగా మైనర్ల డ్రైవింగ్
● అతివేగంతో ప్రాణాలపైకి తెచ్చుకుంటున్న వైనం ● తల్లిదండ్రుల్లో మార్పు అవశ్యం


నెల్లూరు(క్రైం), మే 29 (ఆంధ్రజ్యోతి) : ఉరకలేసే వయస్సు.. రయ్‌రయ్ మంటూ దూసుకెళ్లే మనస్సు, థ్రిల్, స్టైల్ కోసం వేగాన్ని కోరుకునే యువ రక్తం... ఇవన్నీ కలిసి మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ యువత, మైనర్లు ప్రమాదాల బారిన పడుతున్నారు. సరైన శిక్షణ లేకుండా, ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు తెలుసుకోకుండా, సినిమాల్లో హీరోల్లా బైక్‌లతో ఫీట్స్ చేయాలనే ఉత్సాహం తో ప్రమాదాల వైపు అడుగులు వేస్తున్నారు. ఇలాంటి వారి వల్ల పక్కన వెళ్లే వాహనదారులు, ఇతర ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.

మితిమీరిన వేగం... ప్రశ్నిస్తే గొడవ

యువకులు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు. మైనారిటీ తీరని వారికి కూడా కొందరు తల్లిదండ్రులే పాఠశాల, కళాశాలకు వెళ్లేందుకు బైకులు ఇస్తున్నారు. మరికొందరు మైనర్లు ఇంట్లో తెలియకుండా బైకులు వేసుకుని మెయిన్ రోడ్ల మీదకు వచ్చేస్తున్నారు. స్వతహాగాగానీ, స్నేహితుల ప్రోద్బలంతోగానీ వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతూ ఫీట్లు చేస్తున్నారు. కొందరైతే జాతీయ రహదారిపై, నిర్మానుష్య ప్రాంతాల్లో బైక్ రేసులు పెట్టుకొని అమిత వేగంతో దూసుకుపోతున్నారు. బైక్‌లపై ఇష్టారాజ్యంగా తిరుగుతున్న యువతను ప్రజలు ప్రశ్నిస్తుంటే గొడవకు దిగుతున్నారు. పెద్దవాళ్లతో కూడా మర్యాద లేకుండా మాట్లాడుతున్నారు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి

నెలల బిడ్డగా ఉన్న సమయంలోనే తల్లిదండ్రులు, బంధువులు బైక్‌పై ముందువైపు పిల్లలను కూర్చోబెట్టుకుని నడుపుతున్నారు. కొద్ది రోజులకు యాక్సలరేటర్ పిల్లల చేతికి ఇస్తున్నారు. ఐదేళ్ల నిండక ముందే బైక్ హ్యాండిల్‌ను పిల్లలకు ఇచ్చి బ్యాలెన్స్ చేయమంటున్నారు. బైక్‌పైన కూర్చుంటే కాళ్లు కూడా అందని వయసులో బైక్‌లను పిల్లలకు నేర్పించి రోడ్లపైకి పంపుతున్నారు. ఇక కళాశా లకు వెళ్లే వయస్సు వచ్చిన వెంటనే సమాజంలో పేరు కోసమో, పిల్లలు ఇష్టంగా అడిగారన్న ప్రేమతోనే వేగంగా వెళ్లే ఖరీదైన బైకులు కొని స్తున్నారు. కానీ, పిల్లలు వాహనాలను వేగంగా నడుపుతున్నారా?, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్నారా? అని మాత్రం గమనించడం లేదు. పైగా... బంధువుల్లో, తెలిసిన వాళ్లో ఈ విషయం చెబితే కోపగించుకుంటున్నారు. మరి, పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే తట్టుకోగలమా? అని తల్లిదండ్రులు ఆలోచించాలి. పిల్లలకు వాహనాలు ఇచ్చే విషయంలో కాస్త కఠినంగా, అప్రమత్తంగా ఉండటం తప్పనిసరి. పోలీసులు కూడా యువతకు, మైనర్ బాలురకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి ర్యాష్ డ్రైవింగ్‌ను అరికట్టాల్సిన అవసరం ఉంది.





నగర శివార్లలో ఖాళీ రోడ్డుపై స్టంట్ వేస్తున్న యువకుడు



Hall Ticket	: 2518114071	
Name	: RAMISETTY SAI KUNDANA	
Result	: 489 (FAIL)	

10వ తరగతి ఫలితాల కోసం డౌన్‌లోడ్ way2news

	SUBJECT	Marks	Result
1	FIRST LANGUAGE	94	P
2	SECOND LANGUAGE	79	P
3	THIRD LANGUAGE	34	F
4	MATHEMATICS	96	P
5	SCIENCE	92	P
6	SOCIAL STUDIES	94	P

రామిశెట్టి సాయికుందనకు తొలుత వచ్చిన మార్కులు



BOARD OF SECONDARY EDUCATION
ANDHRA PRADESH
SSC PUBLIC EXAMINATIONS, MARCH 2025
REVERIFICATION / RECOUNTING OF MARKS

Roll Number: 2518114071
Subject: 13E_R - English

There is "Change" in your marks from 34 to 93

Posting and totalling of marks Provisions
whether marks are awarded and posted for all correct answers.
the Answers which are not awarded Marks.
no Provision for Re-valuation.


రీవెరిఫికేషన్, కౌంటింగ్ తర్వాత..

విద్యార్థులకు శాపాలు

(5వ పేజీ తరువాయి)

తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికితోడు వీరికి పలు సంఘాలు అండగా ఉండటం, ఎవరికి వారు లాబీయింగ్‌లు చేసుకోవడం పరిపాటిగా మారింది. గత ఏడాది కూడా జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరిగినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మూల్యాంకనంలో జరుగుతున్న తప్పిదాలు తిరిగి పునరావృతం కాకుండా పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులకు ఎదురుచూపులు



కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు (విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ అసిస్టెంట్లకు షెడ్యూల్ ప్రకారం ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించలేక పోయిన విద్యా శాఖ రెండో రోజు కూడా రాత్రి వరకు ప్రారంభించలేకపోయింది. దీంతో గురువారం ఉదయం నుంచే ఎస్ఏ ఉపాధ్యాయులు నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాల అవరణకు చేరుకోవడంతో కోలాహలంగా మారింది. సీనియారిటీ జాబితా, రోస్టర్ పాయింట్ల కేటాయింపులు కూడా ఆలస్యం కావడం, ఇతర సాంకేతిక కారణాలతో గురువారం రాత్రి 8 గంటల వరకు ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పలేదు. చివరకు 8 గంటలపైన అధికారులు చేపట్టినా అభ్యంతరాల నడుమ కొనసాగుతుండటంతో ఏ సమయంలో పూర్తవుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు మాత్రం ఈ ప్రక్రియను సామరస్యంగా పూర్తి చేస్తామని, ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు కల్పించమన్నారు. ప్రధానోపాధ్యాయులకు సంబంధించి 101 మందికి బదిలీలు నిర్వహించి ఉత్తర్వులు ఇవ్వగా, ప్రస్తుతం జరిగే ఎస్ఏలకు బదిలీ అయిన స్థానాల్లో ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు తెలిపారు.

సచివాలయ ఉద్యోగి విధులకు ఆటంకంపై కేసు

నెల్లూరు(విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించినందుకు ఓ వ్యక్తిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని బట్వాడిపాళేనికి చెందిన ఎస్ దివ్య శోధన్‌నగర్‌లోని 38-2 డివిజన్ సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం అడ్మిన్ అసిస్టెంట్ జీ ప్రదీప్‌కుమార్‌తో కలిసి ఆమె అరవిందనగర్‌లో ఇంటి పన్ను రీ సర్వే చేపట్టారు. స్థానికంగా ఉండే ఒంటేరు శ్రీనివాసులు ఇంటికి వెళ్లి కొలతలు తీస్తుండగా శ్రీనివాసులు ఆమెను అడ్డుకున్నారు. అసభ్య పదజాలంతో దూషించాడు. తాను డివిజన్ నాయకుడినని, అంతు చూస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాంగ విద్యార్థులకు 1న ప్రతిభా పురస్కారాలు

నెల్లూరు (హరనాథపురం), మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇటీవల విడుదలైన పదో తరగతి, ఇంటర్ రెండో సంవత్సరం ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన దేవాంగ విద్యార్థులకు జూన్ 1న ప్రతిభ పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమం నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న హెచ్ ఆర్ కల్యాణ మండపంలో జరుగుతుందని దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్, అసోసియేట్ అధ్యక్షుడు సజ్జ వెంకట సురేష్, ప్రధాన కార్యదర్శి పములుల శంకరయ్య, కోశాధికారి కొండ మాధవయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 111 మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. దేవాంగులందరూ పాల్గొనాలని కోరారు.

ఎవరూ అధైర్యపడొద్దు

● కాకాణి కుమార్తె పూజిత

నెల్లూరు(వెంకటేశ్వరపురం), మే 29 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, తామంతా అండగా ఉంటామని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత తెలిపారు. వైసీపీ జిల్లా కార్యాలయం లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తన తండ్రిపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారన్నా రు. న్యాయస్థానాలపై నమ్మకం ఉందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పీ-4 స్ఫూర్తితో విద్యార్థుల దత్తత

● నారాయణ గ్రూపు విద్యాసంస్థల డైరెక్టర్ గంటా రవితేజ

నెల్లూరు(విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పీ-4 విధానం స్ఫూర్తితో విద్యార్థులను దత్తత తీసుకుంటున్నట్లు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు, నారాయణ గ్రూప్ విద్యా సంస్థల డైరెక్టర్ గంటా రవితేజ తెలిపారు. నగరంలోని వీఆర్ హైస్కూల్ పునరుద్ధరణ పనులను గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. పాఠశాలను అత్యాధునిక వసతులతో సిద్ధం చేయడం అభినందనీయమన్నారు. ఇందుకోసం మంత్రి నారాయణ, ఆయన కుమార్తె శరణి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. తాను కూడా భీమిలి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను దత్తత తీసుకుని వారి ఉన్నతికి కృషి చేస్తానని చెప్పారు. వీఆర్ హై స్కూల్ విద్యార్థుల దత్తత విషయమై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా, మంత్రి నారాయణ కుమార్తె శరణి కూడా వీఆర్ హైస్కూల్ ఆధునీకరణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.



వీఆర్ హైస్కూల్లోని తరగతి గదిని పరిశీలిస్తున్న రవితేజ

చిత్తశుద్ధితో చదవాలి : సెంట్రల్ జీఎస్టీ ఏపీ ఉషా

నెల్లూరు (సాంస్కృతికం) మే 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిత్తశుద్ధితో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సెంట్రల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్ రాయ్ పిలుపునిచ్చారు. గురువారం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టౌన్‌హాల్ రీడింగ్ రూమ్‌లో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చదువుకు కులం, మతం, ధనిక, పేద తేడా లేదని, ప్రతీఒక్కరు ఉన్నతస్థాయికి ఎదిగేందుకు చదువు తోడ్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్‌హమీద్, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గడ్డం హనోక్, రెవరెండ్ డేవిడ్ దయాసాగర్, జయప్రకాష్, సురేంద్రబాబు, బర్నాబాస్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలి



పోస్టర్లు ప్రదర్శిస్తున్న జనసేన నాయకులు

నెల్లూరు(విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ జీరో టాలరెన్స్ ఫర్ సెక్సువల్ వైలెన్స్ అనే ప్లకార్డులను ప్రదర్శించారు. కడప జిల్లా మైలవరంలో ఇటీవల చిన్నారిపై సమీప బంధువే అత్యాచారానికి పాల్పడి హత్య చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కారంపూడి కృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, జమీర్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, హర్షద్ అయూబ్, పసుపులేటి శరవణ తదితరులు పాల్గొన్నారు.

కోటంరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు




గిరిధర్‌రెడ్డితో కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : మహానాడులో నెల్లూరు రూరల్ టీడీపీ ఇన్‌చార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి గురువారం టీడీపీ జిల్లా యువనాయకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ శ్రేణుల నడుమ కేక్‌కట్‌చేసి, గిరిధర్‌రెడ్డికి శాలువాతో సత్కరించారు. కోటంరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో నెల్లూరులో సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు సంపృద్ధిగా అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ, బాలాజీ, సునీల్, సిసింద్రీ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

నెల్లూరు(విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం నగరంలోని 29వ డివిజన్ మహాత్మా గాంధీనగర్‌లో టీడీపీ నాయకుడు బ్యంగి మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. గిరిధర్‌రెడ్డి ప్రజా సేవలో మరింత విస్తృతంగా పాల్గొనాలని ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి నేతలకు, కార్మికులకు పంచి పెట్టారు. కనపర్తి గంగాధర్, మమతారెడ్డి, గుద్దేటి చెంచయ్య, మల్లెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, నాదెళ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

కొత్తకాలువ సెంటర్లో అన్నదానం



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

నెల్లూరు రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం రూరల్లోని కొత్తకాలువ సెంటర్లో ఆ పార్టీ నాయకులు అన్నదానం చేశారు. దీనిని ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోడూరు కమలాకర్‌రెడ్డి, వేణు యాదవ్ ప్రారంభించారు. ముందుగా కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలోనూ నాయకులు వేడుకలు నిర్వహించారు.

అనారోగ్యంలో అటెండర్ మృతి

నెల్లూరు రూరల్, మే 29(ఆంధ్రజ్యోతి) : తీవ్ర అనారోగ్యానికి గురైన ఓ అటెండర్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. దర్గామిట్ట పోలీసులు అందించిన సమాచారం మేరకు.. లేక్‌వ్యూ కాలనీలో నివాసముంటున్న రామయ్య (54) శబరిశ్రీరామ క్షేత్రం వద్దనున్న టీడీపీ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. ఆయన భార్య ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. అనారోగ్యంతో ఉన్న రామయ్య బుధవారం రాత్రి పరిస్థితి విష మించడంతో అతనిని కుటుంబ సభ్యులు హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తేల్చారు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.




సభలో అమ్మాయిల ఉత్సాహం


మహానాడు వేదిక


సభకు వచ్చిన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



మహా జాతర







కడపలో మూడురోజుల పాటు నిర్వహించిన టీడీపీ మహానాడు జనజాతరను తలపించింది. మొదటి రెండు రోజులు వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారితే.. చివరి రోజు బహిరంగ సభ నభూతో నభవిష్యత్ అన్న విధంగా జరిగింది. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు విశేషంగా తరలిరావడంతో ఇసుక వేసినా రాలదన్నట్లుగా జరిగింది. లక్షలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో మహానాడు ప్రాంగణం కిటకిటలాడింది. పెద్ద పెద్ద కటౌట్‌లు, బిగ్‌స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. అభిమాన నాయకులు వేదికపైకి రాగానే ఉత్సాహంతో కేకలు వేశారు. సెల్‌ఫోన్లలో రికార్డు చేశారు. మహిళలు, అమ్మాయిలు ఉత్సాహంగా పాల్గొని టీడీపీకి జైకొట్టారు. వేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ బహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కడప జిల్లాపై వరాల జల్లు కురిపించారు. సభ సక్సెస్ కావడంతో జిల్లా నాయకులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు.

- కడప ఆంధ్రజ్యోతి బృందం



మత్స్య శాఖ అదుపులో చెన్నై మోటరైజ్డ్ బోటు

బిట్రగుంట, మే 29(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వల దిన్నె ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న చెన్నై మత్స్యకారుల మోటరైజ్డ్ బోటును కావలి మత్స్యశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసులు గురు వారం అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నై, చుట్టుపక్కల ప్రాంతాలవారు దొంగతనంగా సముద్రంలో చేపలవేట సాగించేందుకు వచ్చారని తెలిపారు. కోస్టల్ మెరైన్ పోలీసుల సహకారంతో మోటరైజ్డ్ బోటును, అందు లోని వేటకు సంబంధించిన మోటార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈనెల ఒకటి నుంచి జూన్14 వరకు రాష్ట్రంలో సముద్ర వేటకు నిషేధం ప్రకటించినా, వేటకు రావ డం చట్టరీత్యా నేరమని అన్నారు. ఉన్నతా ధికారుల సూచనల మేరకు చర్యలు చేపడతు న్నామన్నారు. అయితే బుధ వారం ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు నిలుపుకున్న చెన్నై మత్స్యకారు లను, స్థానిక మత్స్యకార నాయకుడు త్యాగరాజ్, గ్రామస్థులు నిలదీయడంతో ఆటలు సాగవని గ్రహించి, తెల్లవారుజామునే ఐదు గిల్‌నెట్ బోట్లతో ఉడాయించారని తెలిసింది.

- తెల్లవారుజామునే ఉడాయించిన గిల్‌నెట్ బోట్లు

ఇంధన కొరతతో మోటరై జ్‌డ్ బోటు నిలిచి పోయినట్లు తెలిసింది. ఎటువంటి అల్లర్లు జరగకుండా ఇస్కపల్లి మెరైన్ ఎస్ఐ జానకీ రామిరెడ్డి, సిబ్బంది పహారా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పడుగుపాడు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టీ.శ్రీనివాసులు, సచివాలయ మత్స్యకార సహాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మెరైన్ పోలీసులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ అధికారి శ్రీనివాసులు

'ఇరిగేషన్'లో బిల్లుల గోల



- కాజ్ వే వర్సెస్ డీఆర్-డీఎం చానల్
- రూ.17.5 కోట్లు ఎల్‌వోసీ ఇచ్చిన ప్రభుత్వం
- రెండు వర్కులకూ కేటాయించిన సీఈ
- ఈ ఎల్‌వోసీ తమదేనంటున్న కాజ్‌వే కాంట్రాక్టర్
- మాకూ వచ్చిందంటున్న డీఆర్-డీఎం కాంట్రాక్టర్
- బిల్లుల అప్‌లోడ్‌కు బ్రేకులు.. మంత్రుల వద్దకు పంచాయితీ

నెల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గంలోని ముదివర్తి-ముదివర్తిపాలెం మధ్య పెన్నా నదిపై కాజ్ వే నిర్మాణం జరుగుతోంది. సుమారు రూ.100 కోట్లతో ఈ పనులు జరుగుతుండగా ఇప్పటివరకూ రూ.23 కోట్ల మేర పనులు జరిగినట్లు ఇరిగేషన్ అధికారుల ద్వారా తెలుస్తోంది. గత ప్రభుత్వంలో కొంత మేర పనులు చేయగా రూపాయి కూడా కాంట్రాక్టర్‌కు బిల్లు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఈ వర్కును నేరుగా పరిశీలించి పనులు వేగవంతం చేయించారు. దీంతో చేసిన పనులు రూ.23 కోట్లకు చేరడం, ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా బిల్లు రాకపోవడంతో పనుల్లో వేగం తగ్గింది. ఈ ప్రాజెక్టుకు ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా కాంట్రాక్టర్‌కు బిల్లు మంజూ రు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. అలానే కావలి నియోజకవర్గంలోని దగదర్తి వద్ద డీఆర్-డీఎం చానెల్ ఆధునికీకరణ పనులు రూ.25 కోట్లతో జరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో ఈ పను లు మొదలైనప్పటికీ బిల్లుల సమస్యతో చాలా కాలం పాటు పనులు జరగలేదు. అప్ప ట్లో చేసిన పనులకు రూ.6 కోట్ల బిల్లులు తీసుకొని తర్వాత పనులు ఆపేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి ఈ వర్కుపై సమీక్షించారు. పనులు ప్రారంభించేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తేవడంతో పనులు మొదలయ్యాయి. గడిచిన ఏడాది కాలంలో డీఆర్-డీఎం చానెల్ పనులు మరో రూ.12 కోట్ల మేర జరిగాయి. అయితే ఇందులోనూ ఒక్క రూపాయి బిల్లు రాలేదు. కాగా, దీనిపై ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను వివరణ కోరగా కాజ్‌వే, డీఆర్-డీఎం చానల్ పనుల పురోగతి ఎంతమేర పనుల చేశారన్న వివరాలను సీఈ అడిగినట్టు చెప్పారు. ఈ రెండు వర్కులు ముఖ్యమైనవేనంటూ తాను నివేదిక ఇచ్చినట్లు తెలిపారు.

కేటాయింపులపై వివాదం

కాగా రెండు వారాల క్రితం పెన్నార్ డెల్టా కెనాల్ సిస్టమ్‌కు ప్రస్తుత క్వార్టర్‌కు సంబంధించి రూ.17.50 కోట్ల ఎల్‌వోసీ మంజూరు చేసింది. దీంతో ఈ బడ్జెట్‌ను తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ కాజ్‌వే, డీఆర్-డీఎం చానెల్ వర్కులకు విభజించారు. కాజ్ వే వర్కుకు రూ.11.50 కోట్లు, డీఆర్-డీఎం చానెల్ వర్కుకు రూ.6 కోట్లు కేటాయించి, ఆ మేరకు బిల్లులు అప్‌లోడ్ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సరిగ్గా ఇక్కడే అసలు కథ మొదలైంది. ఈ కేటాయింపుల చుట్టూ ఇప్పుడు వివాదం రాజుకుంది. తాము ప్రయత్నిస్తేనే ఎల్‌వోసీ ఇచ్చారని, అది తమ వర్కుకే ఇచ్చారని కాజ్ వే కాంట్రాక్టర్ చెబుతున్నారు. అయితే ఈ ప్రభుత్వంలో తాము పనులు చేశామని, అందుకే బడ్జెట్ ఇచ్చారని డీఆర్-డీఎం చానెల్ కాంట్రాక్టర్ అంటున్నారు. ఈ ఇద్దరు కాం ట్రాక్టర్లు తమకు ఉన్న రాజకీయ బలంతో అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఒత్తిడిలోకి వెళ్లిన ఇరిగేషన్ అధికారులు పది రోజులుగా ఒక్క బిల్లు కూడా అప్‌లోడ్ చేయలేదు. తాజాగా ఈ వ్యవహారం ఆర్థిక, ఇరిగేషన్ శాఖల మంత్రుల వద్దకు చేరినట్లు ఇరిగేషన్ శాఖలో చెప్పుకుంటున్నారు. పది రోజుల్లోపు బిల్లులు అప్‌లోడ్ చేయకపోతే ఎల్‌వోసీని ప్రభుత్వం వెన క్కు తీసుకునే అవకాశమున్నట్లు ఇరిగేషన్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మరి అప్పటిలోపు వివాదం పరిష్కారమై వచ్చిన బడ్జెట్ వెనక్కుపోకుండా ఎవరొకరికైనా బిల్లు దక్కుతుందో లేదో చూడాలి. ఈ వివాదంపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌ను చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్ ఆదేశించినట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

నవగ్రహ యాత్ర

నవగ్రహాలు, షుగర్ నివారణ, సంతానం లేని, వివాహం కాని వారికి పూజలకు ఆలయాలు తేది:05-06-25 3రోటికి 5499/- (AC బస్సు, భోజనం+రూం) కె.వాసు, సెల్: 94913 40504 AJR-212079

FLAT FOR SALE

నెల్లూరు టౌన్, పొదలకూరు, కొత్త కాలువ సెంటర్ దగ్గరగా తక్కువ ధరలో నుడా అప్రూవ్ కలిగిన ఓపెన్ ప్లాట్స్ కేవలం 6000 మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్ బ్యాంకు లోన్ సౌకర్యం. సెల్: 91214 59131, 76619 63007 AJR-212162

హెల్పర్స్ కావలెను

రేమాండ్ షాప్, నర్తకి సెంటర్ NTR బొమ్మ దగ్గర, నెల్లూరు నందు పనిచేయుటకు హెల్పర్స్ (జెంట్స్/ లేడీస్) కావలెను. 30 సం.ల లోపు వారు సం.ప్ర.93901 62762 AJR-080

WANTED

★ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ని, పిల్లలను చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు కావలెను. ఏజెంట్స్ కూడా కావలెను. జీతం: 15k, ఏజెంట్ కమీషన్ : 5k. ఫోన్: 8977517749 AJH-6753

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

డిజి లక్ష్మి వస్తోంది!



పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు వివిధ రూపాల్లో ఉపాధి పొందేందుకు తోడ్పాటునందిస్తోంది. తాజాగా వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో డిజి లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్సీ) ఏర్పాటుకు సంకల్పించింది. వీటిద్వారా ప్రజలకు డిజిటల్ సేవలు అందిస్తూ మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేలా పథకానికి రూపకల్పన చేసింది. జూన్ 8వ తేదీన రాష్ట్రంలో 'డిజి లక్ష్మి' పథకం ప్రారంభం కానుండగా జిల్లాలో ఆ నెలాఖరుకు గానీ జూలైలోగానీ ఈ పథకం సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

- పొదుపు మహిళల కోసం కొత్త పథకం
- త్వరలో ప్రారంభించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- డిజిటల్ సేవలతో స్వయం ఉపాధి
- విస్తృతంగా సీఎస్సీ సెంటర్ల ఏర్పాటు
- జిల్లాలో 396 కేంద్రాలకు సన్నాహాలు

నెల్లూరు (హరనాథపురం), మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డిజి లక్ష్మి పథకం త్వరలో అమలులోకి రానుంది. ఈ పథకం కింద డిజి లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్సీ) ఏర్పాటు చేయనున్నారు. కామన్ సర్వీస్ సెంటర్లు డిజిటల్ ఇండియా కార్యక్రమంలో ఒక ముఖ్యమైన భాగం. ఇవి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు డిజిటల్ సేవలు అందించేందుకు సహాయపడతాయి. జిల్లాలో ఇప్పటికే 396 సెంటర్ల ఏర్పాటుకు మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. మీ సేవ కేంద్రాల్లో అందించే వివిధ రకాల డిజిటల్ సేవలను డిజి లక్ష్మి పథకానికి ఎంపికైన పొదుపు సంఘాల మహిళలు అందించనున్నారు. జూన్ 8వతేదీ నుంచి రాష్ట్రంలో ఈ డిజిటల్ సేవలు అందు బాటులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 6వతేదీ వరకు జిల్లాలో ఈ సెంటర్ల ఏర్పాటుకు మహిళల ఎంపిక రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగనుంది. జూన్ ఆఖరిలోగానీ జూలై మొదటి వారంలోగానీ జిల్లా వ్యాప్తంగా డిజి లక్ష్మి సెంటర్లు ప్రారంభంకానున్నాయి.

ఒక్కో సెంటర్‌లో ముగ్గురు

డిజి లక్ష్మి సీఎస్సీ సెంటర్ల ఏర్పాటు ద్వారా మహిళల ఆదాయ మార్గాలకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఒక్కొక్క సెంటర్‌లో ముగ్గురు ఉపాధి పొందే వీలుంటుంది. సుమారు రూ.30 వేల నుంచి రూ.40వేల వరకు ఆదాయం వస్తుందని అధికారుల అంచనా. ఈ సెంటర్ల ఏర్పాటు కోసం పట్టణ ప్రాంతాల్లో స్లం లెవల్ సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్) పరిధిలో ఉన్న పొదుపు సంఘం నుంచి డిగ్రీ చదివిన వారిని ఎంపిక చేస్తున్నారు. ఒక్కొక్క ఎస్ఎల్ఎఫ్ పరిధిలో 25 స్వయం సహాయక సంఘాలు ఉంటాయి. వీటిల్లో సుమారు 250 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కొక్క ఎస్ఎల్ఎఫ్ నుంచి ఒక మహిళను డిజి లక్ష్మి సేవలకు ఎంపిక చేస్తున్నారు. అలా ఎంపికైన మహిళకు రూ2లక్షల రుణం ఇస్తారు. దాంతో కంప్యూటర్, దానికి అనుబంధమైన పరికరాలు సమకూర్చుకోవచ్చు.

త్వరలో అందుబాటులోకి తెస్తాం



జిల్లాలో డిజి లక్ష్మి సీఎస్సీ సెంటర్ల సేవలను అతి త్వరలో ప్రజ లకు అందుబాటులోకి తీసుకు వస్తాం. ఇప్పటికే 396 మంది డిగ్రీ చేసిన పొదుపు సంఘాల మహిళ లను గుర్తించి వారికి ఈ సెంటర్ల ఏర్పాటుకు అనుమతి ఇస్తున్నాం. జూన్ 6వతేదీ వరకు దరఖాస్తు, ఎంపిక కార్యక్రమాలు ఉంటా యి. ఆ తర్వాత ఎన్ని సెంటర్లు ఏర్పాటు చేసేది తెలియజేస్తాం.

- లీలారాణి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్

అర్హతలు ఇవి

- పొదుపు మహిళలకు 21 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉండాలి.
- పొదుపు సంఘంలో మూడేళ్ల తప్పనిసరిగా పొదుపు చేసి ఉండాలి.
- డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ నైపుణ్యం కలిగి ఉండాలి.

సేవలు ఇలా...

- మీ సేవ కేంద్రాల్లో ప్రస్తుతం అందిస్తున్న అన్నీ సేవలను డిజి లక్ష్మి సీఎస్సీ సెంటర్ల ద్వారా అందిస్తారు.
- రేషన్‌కార్డు, పాస్‌పోర్టు, ఆధార్‌కార్డు, ఓటర్‌కార్డు, జనన, మరణ ధ్రువీకరణల మంజూరు, బ్యాంకు ఖాతా తెరవడం, డబ్బు డిపాజిట్ చేయడం, విత్ డ్రా చేయడం, ఇతర బ్యాంకింగ్ సేవలు ఉంటాయి.
- విద్యార్థులకు సర్టిఫికెట్లు, వివిధ కోర్సుల్లో చేరడానికి నమోదు, ఆరోగ్య బీమా పాలసీలు, వ్యవసాయ సేవలు అందిస్తారు.

విగ్రహ ప్రతిష్ఠోత్సవాల ప్రారంభం

దుత్తలూరు (ఉదయగిరి), మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో గురువారం నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా వేదపండితులు స్వామివార్లకు గణపతి పూజ, అష్టోతర కలశస్థాపన, పుణ్యహవచనం, అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం చేపట్టారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9162
వెండి కిలో ధర	రూ. 100400
వెండి ఒక గ్రాము	రూ. 103.40


సంగం నుంచి కడపకు వెళ్తున్న టీడీపీ శ్రేణులు


అనంతసాగరం : మహానాడుకు తరలిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు


కలువాయి : వాహనాల వద్ద టీడీపీ శ్రేణులు

మహానాడుకు భారీగా తరలిన తెలుగు తమ్ముళ్లు

సంగం, మే 29 (ఆంధ్రజ్యోతి): కడపలో టీడీపీ మహానాడు బహిరంగ సభకు సంగం మండలం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. సుమారు 28 బస్సుల్లో 1500 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

● **అనంతసాగరం :** మండలంలోని అన్ని గ్రామాల నుంచి గురువారం కడపలో మహానాడు సభకు భారీగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ జెండాలతో వాహనాలు కళకళలాడాయి.

● **కలువాయి :** కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు మండలం నుంచి గురువారం పెద్ద ఎత్తున నాయకులు, కార్యర్తలు, అభిమానులు తరలివెళ్లారు. మండలంలోని ప్రతి పంచాయతీ నుంచి టీడీపీ శ్రేణులు వెళ్లారు. మండల టీడీపీ కన్వీనర్ జీ వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో 20 బస్సులు, కార్లు, టెంపోలకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పోస్టర్లు, బ్యానర్లు కట్టుకుని ఉత్సాహంగా తరలివెళ్లారు.

ఉదయగిరి నుంచి 400 బస్సుల్లో..

ఉదయగిరి : కడపలో మహానాడు బహిరంగ సభకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో గురువారం టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. వింజమూరులో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అలాగే ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. నియోజవకర్గంలోని ఎనిమిది మండలాల నుంచి 200 బస్సులు, 200 కార్లలో సుమారు 20 వేల మంది బయలుదేరి వెళ్లారు. కార్యకర్తలతో కిక్కిరిసిన బస్సుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నాయకత్వం వర్థిల్లాలి అం టూ నినాదాలతో హోరెత్తించారు. 167-బీజీ, 565 జాతీయ రహదారులపై వాహనాలు బారులు తీరడంతో పసుపు మయంగా మారింది. సభకు వెళ్లే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భోజనం, మంచినీరు, మజ్జిగ ఏర్పాట్లు చేశారు. కాగా, సభా ప్రాంగణంలో యువ నేత నారా లోకేష్ ఎమ్మెల్యే సురేష్‌తో ముచ్చటించారు.


మహానాడులో ఎమ్మెల్యే కాకర్లతో ముచ్చటిస్తున్న లోకేష్

● **వింజమూరు :** కడపలో టీడీపీ మహానాడు బహిరంగ సభకు వింజమూరు మండలం నుంచి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. గురు వారం ఉదయం వింజమూరులోని బంగ్లా సెంటర్ నుంచి వాహనాలలో తరలివెళ్లారు. ఈకార్యక్రమంలో సీని యర్ నాయకులు గూడా నరసారెడ్డి, చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, వనిపెంట సుబ్బారెడ్డి, జూపల్లి రాజారావు, కోడూరు నాగిరెడ్డి, గణపం సుదర్శన్‌రెడ్డి, తిరుపతి ఆచారి, మంచాల శ్రీనివాసులునాయుడు, గువ్వల కృష్ణారెడ్డి, జీజీశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● **సీతారామపురం :** కడపలో మహానాడు బహిరంగ సభకు మండల టీడీపీ నాయకులు చెన్నకేశవులు, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, చింతల శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, మండల ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ బాబు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, మాజీ జడ్పీటిసి కలివెల జ్యోతి, చంద్రారెడ్డి, వికాష్‌బాబు, రవి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.


వింజమూరు నుంచి మహానాడుకు వెళ్తున్న టీడీపీ శ్రేణులు


సీతారామపురంలో టీడీపీ నాయకుల కోలాహలం

కామ్రేడ్ జక్కా వెంకయ్య ఆశయ సాధనే లక్ష్యం : సీపీఎం

ఆత్మకూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ జక్కా వెంకయ్య ఆశయ సాధనే లక్ష్యంగా ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్తామని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని డాక్టర్ చెర్లో రమణారెడ్డి స్మారక భవనంలో మాజీ ఎమ్మెల్యే, సీపీఎం నేత జక్కా వెంకయ్య వర్ధంతి నిర్వహించారు. సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు జక్కా వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం కామ్రేడ్ జక్కా వెంకయ్య ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు ఎం పుల్లయ్య, కె డేవిడ్‌రాజు, జి లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, నాగేంద్ర, సీఐటీయు నాయకులు జి శివప్రసాద్, కొండమూరి హజరత్తయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు: జక్కా వెంకయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు ఆత్మకూరు నాగయ్య

●అనంతసాగరం: స్థానిక ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో గురువారం జక్కా వెంకయ్య వర్ధంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన వాసన్ ఐకేర్ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, అన్వర్‌బాష, సుబ్బారాయుడు, వేము పెంచలయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి : స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గురువారం జక్కా వెంకయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కోడె రమణయ్య, ఫరుద్దీన్‌బాషా, నాయబ్, నాగేశ్వరరావు, కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కరోనా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

● **డాక్టర్ కేవీ శేషారత్నం, సూపరింటెండెంట్**

ఆత్మకూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): కరోనా గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే తగు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కెవి శేషారత్నం సూచించారు.

? కరోనా పొంచి ఉన్న నేపథ్యంలో ప్రత్యేక వార్డు ఏర్పాటుచేశారా.

! ఉన్నతాధికారుల నుంచి అలాంటి ఆదేశాలు అందలేదు. కరోనా టెస్ట్ కిట్స్ కూడా ఇంకా అందలేదు. ముందు జాగ్రత్తగా వార్డును సిద్ధం చేస్తున్నాం.

? ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో ఆక్సిజన్ ప్లాంట్స్ పనిచేస్తున్నాయా.

! వైద్యశాలలో ఉన్న మూడు ఆక్సిజన్ ప్లాంట్స్‌లో రెండు పనిచేస్తున్నాయి. ఒకటి మాత్రం మరమ్మతులకు గురై ఉంది. దానిని మరమ్మతులు చేయించేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం.

? వైద్యశాలలో మందుల కొరత ఉందా.

! వైద్యశాలలో మందుల కొరత లేదు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన మందులను ఎప్పటికప్పుడు తెప్పిస్తున్నాం. హెచ్ఎంపీఐవి వైరస్ పట్ల అప్రమత్తంగా ఉన్నాం. మాస్కులు, శానిటైజర్లు, గ్లూకోమీటర్లు, పల్స్ ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ పైపులైను, సిలిండర్లు, యాంటివైరల్‌కు సంబంధించిన మందులన్నీ అందుబాటులో ఉన్నాయి.

? వైద్యశాలలో డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందా.

! వైద్యశాలలో డాక్టర్ల కొరత ఉంది. 8 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో డాక్టర్ల నియామకం జరుగుంతుదని ఆశిస్తున్నాం.

భక్తిశ్రద్ధలతో వెంగమాంబకు పల్లకీ సేవ


అమ్మవారికి పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

దుత్తలూరు(ఉదయగిరి), మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి పల్లకీ సేవను గురువారం అర్చకులు, ఆలయ సిబ్బంది భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక చందన అలంకారం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం పల్లకీ సేవ చేపట్టారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజులు నిర్వహించారు.

సోమశిలలో 43.042 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 29 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి 43.024 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 3,300, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల సరఫరా చేస్తున్నారు.

80 శాతం హాజరు ఉంటేనే కుట్టుమిషన్ పంపిణీ


కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పాజీ

ఉదయగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలకు 80 శాతం హాజరు ఉంటేనే ప్రభుత్వం అందజేసే కుట్టుమిషన్ అందుతుందని ఎంపీడీవో అప్పాజీ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలక్షేపం కోసం కుట్టు శిక్షణకు హాజరు కారాదన్నారు. శిక్షణలో ప్రతిభ కనబర్చి కుటుంబానికి ఆర్థిక తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సమద్, నిర్వాహకురాలు నాజియాతాజిన్, శిక్షకురాలు పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

ఉదయగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, శారీరక, మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుడినరవ, శకునాలపల్లి, ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో యోగా శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఉన్నత పాఠశాల శిక్షణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మానసిక వత్తిడిని తగ్గించే శక్తి యోగాకు ఉందన్నారు. ప్రతిఒక్కరూ ఉదయం, సాయంత్రం వయసుతో సంబంధం లేకుండా యోగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్సుపర్సన్ హెచ్ఎం షబ్బీర్, సీఆర్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరి: యోగా చేస్తున్న పట్టణ ప్రజలు

●అనంతసాగరం: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉద్యోగులకు యోగాపై ప్రతేక శిక్షణ ఇచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రయ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారికి నిధుల కేటాయింపు హర్షణీయం

ఆత్మకూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : కడప - నెల్లూరు జిల్లాల మధ్య కీలక ప్రాజెక్టు అయిన గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.3,653 కోట్లు కేటాయించడం హర్షణీయమని బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బిజెపి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి రాష్ట్ర అభివృద్ధికి చేయూత నివ్వాలని కోరుతూ పలు అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశామన్నారు. అందులో ప్రధానంగా నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు రోడ్డు నుంచి కడప జిల్లా బద్వేల్ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారిని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరామన్నారు. ముఖ్యంగా రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జాతీయ రహదారి నిర్మాణా నికి కృషిచేయడం హర్షదాయకమన్నారు. నూతన జాతీయ రహదారి నిర్మాణంతో పారిశ్రామికంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల బదిలీ

ఉదయగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బదిలీపై వెళ్లినట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు గురువారం తెలిపారు. మండలంలోని అప్ప సముద్రం పాఠశాల హెచ్ఎం విజయకుమార్ శిద్దన కొండూరుకు, వెంగళరావునగర్ పాఠశాల హెచ్ఎం నూర్జహాన్ ఉదయగిరి బీసీ కాలనీ ఉర్దూ పాఠశాలకు, కృష్ణంపల్లి పాఠశాల హెచ్ఎం శివరామిరెడ్డి మాముడూరుకు, ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలకేశవులు బుచ్చిరెడ్డిపాళెంకు, గండిపాళెం పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు కాటేపల్లికి బదిలీ అయినట్లు ఆయన తెలిపారు.

తహసీల్దారు కార్యాలయ ఆవరణలో పిచ్చిచెట్ల తొలగింపు

కలువాయి, మే 29 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయం ఆవరణలో శుక్రవారం రైతుల భూ సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు ఆర్డీవో పావని హాజరుకానున్నారు. దీంతో గురువారం రెవెన్యూ సిబ్బంది తహసీల్దారు కార్యాలయం చుట్టుపక్కల పిచ్చిచెట్లను తొలగించి శుభ్రం చేశారు. కాగా, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా మూడవ శనివారం కనీసం కార్యాలయంలో రికార్డులపై దుమ్ము కూడా తుడవని వారు ఆర్డీవో వస్తున్నారని శుభ్రం చేయడం చర్చనీయాంశమైంది.

సమాచారం తెలిసేదెలా..

● **దిష్టిబొమ్మగా మారిన దిమ్మె**

ఉదయగిరి రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సమగ్రమైన సమాచారం అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం శాఖల వారీగా సమాచార బోర్డులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా అవి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో గండిపాళెం జలాశయానికి సంబంధించిన ప్రధాన కుడి కాలువ వివరాలు తెలిపేలా మండల కేంద్రమైన ఉదయగిరికి వెళ్లే మార్గంలో ఏర్పాటుచేసిన సమాచార సిమెంటు దిమ్మె దిష్టిబొమ్మగా మారి వెక్కిరిస్తోంది. ఎప్పుడో ఏళ్ల తరబడి నిర్మించిన ఆ దిమ్మెలోని వివరాలు కనిపించగా పోగా చుట్టూ కంపచెట్లు కమ్మేసినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అటుగా ప్రయాణాలు సాగించే ప్రజలు కనీసం సమాచారం తెలుసుకోలేక పోతున్నామంటూ వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు సమగ్ర సమాచారం అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


సమాచార దిమ్మెను కమ్మేసిన కంపచెట్లు

పహల్గాం బాధితులను ప్రధాని పరామర్శించరా ?

● **జక్కా వెంకయ్య సేవలు మరువలేనివి**

● **సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు**

నెల్లూరు (వైద్యం), మే 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలను ప్రధాని నరేంద్ర మోదీ నేటికీ పరామర్శించ లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. గురువారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పహల్గాం అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించారని, ఇది కేంద్ర ప్రభుత్వ ఇంటలిజెంట్స్ వైఫల్యమే నన్నారు. బాధితులను ఓదార్చాల్సిన మోదీ ఆ ప్రయత్నం చేయకపోవటం సరికాదన్నారు. సీపీఎం నాయకుడు జక్కా వెంకయ్య సేవలు మరిచి పోకూడదన్నారు. ఆయన జిల్లాలో అనేక భూపోరాటాలు, కూలీల సమస్యలపై పోరాటాలు చేసిన నేత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు మాదాల వెంకటేశ్వ ర్లు, అజయ్ కుమార్, గోగుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రి హత్య కేసులో కుమారుడికి జీవితఖైదు

నెల్లూరు (లీగల్), మే 29 (ఆంధ్రజ్యోతి) : వ్యసనాల కోసం డబ్బు ఇవ్వలేదనే కోపంతో తండ్రిని హత్య చేసిన కేసులో నేరం రుజువు కావడంతో షేక్ తాజుద్దీన్ అనే నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... నెల్లూరు నగరం బుజబుజ నెల్లూరు చెన్నకేశవ నగర్‌కు చెందిన షేక్ మస్తాన్ అలియాస్ బండా మస్తాన్ కత్తులకు సానబడుతూ జీవించేవాడు. ఇతనికి ఇద్దరు పిల్లలు. మస్తాన్ పక్షవాతానికి గురై బాధపడుతుండేవాడు. అయన కుమారుడు షేక్ తాజుద్దీన్ వ్యసనాలకు బానిసై కుటుంబ సభ్యులను వేధించేవాడు. ఆ బాధ తట్టుకోలేక అయన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. 2021 జూన్ 4వ తేదీన ఇంట్లో మస్తాన్ ఒక్కడే ఉండగా తాజుద్దీన్ వెళ్లి డబ్బు అడిగాడు. మస్తాన్ ఇవ్వకపోవడంతో కత్తితో అతని మెడ కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. చుట్టు పక్కల వారు వచ్చి చూడగా మస్తాన్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఈ నేరంపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడం తో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఇన్‌చార్జి ఏపీపీ సుందరయ్య యాదవ్ వాదించారు.

దోపిడీ దొంగల అరెస్టు

నెల్లూరు(విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా వెళుతున్న వారిని కత్తులతో బెదిరించి నగదు దోపిడీ చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు నవాబుపేట సీఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం స్టేషన్‌లో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. నెల్లూరులోని పాత చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన వెంకయ్యను ఈనెల 28న అరవ అజిత్, షేక్ ఉస్మాల్ అలియాస్ దాహూలు అడ్డుకుని కత్తులతో బెదిరించి అతని వద్ద ఉన్న నగదును దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించారు. గురువారం భగత్‌సింగ్ కాలనీ వద్ద వారిని అదుపులోకి తీసుకుని రెండు కత్తులు, నగదు స్వాధీనం చేసుకున్నారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో యువతి ఆత్మహత్యాయత్నం

● **హుటాహుటిన వైద్యశాలకు తరలించిన పోలీసులు**

ఉదయగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా ఉదయగిరి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఓ యువతి పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మండలంలోని జీ.చెర్లోపల్లి పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన బత్తుల శివప్రియ నెల్లూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. అదే గ్రామానికి చెందిన వల్లెపు హరికృష్ణతో నెల్లూరులోనే ఉంటూ కొన్నేళ్లుగా సహజీవనం చేస్తోంది. ఇటీవల హరికృష్ణకు ఓ యువతితో వివాహం నిశ్చయమై వచ్చే నెల 5న నిశ్చితార్థం జరగనుంది. దీంతో శివప్రియ, హరికృష్ణ మధ్య మనస్పర్థలు చోటుచేసుకొన్నాయి. ఈ నేపథ్యంలో హరికృష్ణ వివాహం చేసుకునే యువతికి శివప్రియ ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో కోపోద్రిక్తుడైన హరికృష్ణ వైద్యశాలలో విధి నిర్వహణలో ఉన్న శివప్రియపై కర్రతో దాడి చేశాడు. అక్కడే ఉన్న సిబ్బంది సర్దిచెప్పడంతో అక్కడ నుంచి వెనుతిరిగాడు. మనస్తాపానికి గురైన శివప్రియ స్వగ్రామానికి చేరుకొని తల్లి కొండమ్మతో కలిసి ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లేనందున సాయంత్రం రావాలని అక్కడున్న కానిస్టేబుళ్లు చెప్పారు. ఈ క్రమంలో తెలంగాణలోని వరంగల్‌లో ఉన్న శివప్రియ అన్న నాగార్జున తన తల్లి కొండమ్మకు ఫోన్ చేసి జరిగిన విషయం గురించి మాట్లాడాడు. దీంతో మనస్తాపానికి గురైన తల్లీకూతుళ్లు బస్టాండ్ సెంటర్‌లో పురుగుమందు కొనుగోలు చేసి తిరిగి పోలీస్‌స్టేషన్ ఆవరణలోకి వచ్చారు. అక్కడ శివప్రియ ఆ మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన పోలీసులు ఆ యువతిని హుటాహుటిన పోలీసు జీపులో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఆటో

● **డ్రైవర్‌కు తీవ్ర గాయాలు**


ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్

సంగం, మే 29 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి చెట్టును ఆటో ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని సంగం - కలిగిరి రహదారిలో ఆశ్రమం మలుపు సమీ పంలో గురువారం మధ్యాహ్నం జరిగింది. వివరాల మేరకు... ఏఎస్‌పేటకు చెందిన ఆటో డ్రైవర్ తన ఇద్దరు మనవళ్లను ఎక్కించుకుని సంగంలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఆశ్రమం మలుపు సమీపంలో ముందు వెళ్తున్న ఆటోను ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఆటో ఢీకొంది. దీంతో డ్రైవర్ కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆత్మ కూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనుబోలులో హిజ్రాల వీరంగం

మనుబోలు, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆటో సెంటర్ వద్ద గురువారం హిజ్రాలు వీరంగం సృష్టించారు. గత కొద్ది రోజులుగా మనుబోలుకు హిజ్రాలు వస్తున్నారు. సాయంత్రం వేళ వీరంపల్లి క్రాస్‌రోడ్డు, బద్దెవోలు క్రాస్‌రోడ్డుల వద్ద మోటార్‌సైకిళ్ళు, కార్లు, ఆటోలు నిలిపి డబ్బులు వసూలుచేస్తున్నారు. అలాగే మనుబోలులో దుకాణాల వద్ద, ఆటో సెంటర్‌లో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈక్రమంలో ఆటో సెంటర్ వద్ద హిజ్రాలతో ఆటోడ్రైవర్లు, ప్రయాణికులు తిరగబడడంతో హిజ్రా చెప్పుతో కొట్టేందుకు ప్రయత్నించింది. దీంతో ప్రయాణీకులు, ఆటో డ్రైవర్లు ఎదురుతిరగడంతో హిజ్రాలు వెళ్ళిపోయారు. పోలీసులు స్పందించి గ్రామంలోకి హిజ్రాలు రాకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	256

కోడిగుడ్ల ధర (100): 525

చెత్త ఏరుకునే వారికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం

కందుకూరు, మే 29(ఆంధ్రజ్యోతి): వీధుల్లో, డస్ట్‌బిన్‌ల వెంట చెత్త ఏరుకోవటం, ఇంటింటా తిరిగి పాత చెత్తను సేకరించుకునే వృత్తిచేసేవారికి కేంద్రప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నదని మున్సిపల్ కమిషనర్ కే. అనూష ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారా వారి వారి కుటుంబస్థితిని మెరుగుపరచాలన్న లక్ష్యంతో నమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్) స్కీంను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. అలా జీవనం సాగిస్తున్నవారంతా మున్సిపాలిటీలో పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. వారందరికీ ఐడెంటిటీ కార్డులు మంజూరుచేస్తామన్నారు. గుర్తింపు కార్డులు పొందిన వారికి కేంద్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రూ. 5 లక్షల వరకు ఆరోగ్యబీమా అమలయ్యేలా చూస్తుందన్నారు. అంతేకాక వారి వృత్తిలో మరింత ఆదాయం పొందేందుకు అవసరమైన రుణ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆమె వివరించారు. 59 ఏళ్ల పైబడిన వారికి ఈ-శ్రామ్ కార్డు ఇచ్చి ప్రతినెలా రూ. 3వేలు పింఛన్ ఇవ్వటంతోపాటు వారి పిల్లలకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ అమలు చేస్తుందన్నారు.

ప్రమాదాలకు నిలయం లింకు రోడ్డులో ప్రయాణం

● రోడ్డుకిరువైపులా అల్లుకున్న ముళ్ల కంపలు ● ఆపై రాత్రిళ్లు అంధకారం



కంపచెట్లతో కుంచించుకుపోయిన రోడ్డు

కావలి రూరల్, మే29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దపవని, ఉదయగిరి రోడ్లను కలిపే లింక్‌రోడ్డు కంపచెట్లతో, రోడ్డు పక్కన నాటిన చెట్లకొమ్మలతో కుంచించుకుపోయింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పట్టణ, గ్రామీణ ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు. పట్టణంలోని పెద్దపవని రోడ్డు గుండా ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని గ్రామాల నుంచి కావలికి రాకపోకలతో ఆ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. రెండురోడ్లను అనుసంధానం చేసే రోడ్డు కావటంతో పాటు ఒక పక్క ఫారెస్ట్, పీజీ సెంటర్ భూములు, మరో పక్క ఒరవ కాలువ ఉండడంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో రెండు వాహనాల క్రాసింగ్‌లో ప్రమాదాల బారినపడాల్సి వస్తుంది. అలాటే విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో ఆ మార్గంలో అంధకారం నెలకొంది. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు మార్జిన్ లో కంపచెట్లు, చెట్ల కొమ్మలు తొలగించాలని, విద్యుత్ స్తంభాలకు లైట్లు వేయించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రైతుల ప్రోత్సాహానికి పలు కార్యక్రమాలు



అల్లూరు : మాట్లాడుతున్న ఏడీఏ మారుతీదేవి

అల్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాయని, రైతులను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలను రూపొందిస్తున్నాయని జిల్లా వ్యవసాయ రిసోర్స్ సెంటర్ ఏడీఏ మారుతీదేవి, కావలి ఏడీఏ నాగరాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రైతులకు వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విజ్ఞానంతో ఆలోచించి వ్యవసాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్. లోకేష్‌బాబు, వ్యవసాయాధికారులు గీతాకుమారి, వెంకటేశ్వర్లు, వీఏఏలు పాల్గొన్నారు.

● కరేడులో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్

ఉలవపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు, అలగాయపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ నిర్వహించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి బీ తిరుమల జ్యోతి తెలిపారు. స్థానిక రైతులకు శాస్త్రవేత్తలు సూచనలు చేశారు. కందుకూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ ప్రసాద్‌బాబు, నిర్కా పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గంగాధర్, హైదరాబాద్ కోళ్ల పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కణ్ణన్, ఉర్మి స్టార్టప్ కంపెనీ ప్రతినిధి రాకేష్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కందుకూరు వ్య వసాయ సబ్‌డివిజన్ అధికారి అనసూయ, కేవీ కే శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శ్రీరంగ, బీటీఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు : రసాయనాలను పిచికారి చేసే డ్రోన్ ప్రదర్శన



Hall Ticket : 2518114071
Name : RAMISETTY SAI KUNDANA
Result : 489 (FAIL)
10వ తరగతి ఫలితాల కోసం
way2news

	SUBJECT	Marks	Result
1	FIRST LANGUAGE	94	P
2	SECOND LANGUAGE	79	P
3	THIRD LANGUAGE	34	F
4	MATHEMATICS	96	P
5	SCIENCE	92	P
6	SOCIAL STUDIES	94	P

రామిశెట్టి సాయికుందనకు తొలుత వచ్చిన మార్కులు



BOARD OF SECONDARY EDUCATION
ANDHRA PRADESH
SSC PUBLIC EXAMINATIONS, MARCH 2025
REVERIFICATION / RECOUNTING OF MARKS

Roll Number: 2518114071
Subject: 13E_R - English

There is "Change" in your marks from 34 to 93

Posting and totalling of marks Provisions
whether marks are awarded and posted for all correct answers.
the Answers which are not awarded Marks.
no Provision for Re-valuation.

రీవెరిఫికేషన్, కౌంటింగ్ తర్వాత..

విద్యార్థులకు శాపాలు

(5వ పేజీ తరువాయి)

తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికితోడు వీరికి పలు సంఘాలు అండగా ఉండటం, ఎవరికి వారు లాబీయింగ్‌లు చేసుకోవడం పరిపాటిగా మారింది. గత ఏడాది కూడా జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరిగినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మూల్యాంకనంలో జరుగుతున్న తప్పిదాలు తిరిగి పునరావృతం కాకుండా పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులకు ఎదురుచూపులు



కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరు (విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ అసిస్టెంట్లకు షెడ్యూల్ ప్రకారం ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించలేక పోయిన విద్యా శాఖ రెండో రోజు కూడా రాత్రి వరకు ప్రారంభించలేకపోయింది. దీంతో గురువారం ఉదయం నుంచే ఎస్ఏ ఉపాధ్యాయులు నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణకు చేరుకోవడంతో కోలాహలంగా మారింది. సీనియారిటీ జాబితా, రోస్టర్ పాయింట్ల కేటాయింపులు కూడా ఆలస్యం కావడం, ఇతర సాంకేతిక కారణాలతో గురువారం రాత్రి 8 గంటల వరకు ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పలేదు. చివరకు 8 గంటలపైన అధికారులు చేపట్టినా అభ్యంతరాల నడుమ కొనసాగుతుండటంతో ఏ సమయంలో పూర్తవుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు మాత్రం ఈ ప్రక్రియను సామరస్యంగా పూర్తి చేస్తామని, ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు కల్పించమన్నారు. ప్రధానోపాధ్యాయులకు సంబంధించి 101 మందికి బదిలీలు నిర్వహించి ఉత్తర్వులు ఇవ్వగా, ప్రస్తుతం జరిగే ఎస్ఏలకు బదిలీ అయిన స్థానాల్లో ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు తెలిపారు.

మహానాడుకు తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు



కావలి : మహానాడుకు తరలుతున్న తెలుగు తమ్ముళ్లు



వలేటివారిపాలెం : కళవళ్ల గ్రామం నుంచి మహానాడుకు వెళ్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



జలదంకి : జమ్మలపాలెం నుంచి మహానాడుకు తరలివెళ్తున్న తెలుగుతమ్ముళ్లు

కావలి,మే29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం నుంచి మహానాడుకు గురువారం భారీగా తెలుగు తమ్ముళ్ల తరలిపోయారు. 78 బస్సులు, 130 కార్లలో నేతలు, కార్యకర్తలు తరలివెళ్లినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. పట్టణం నుంచి వెళ్లే బస్సులు మినీ స్టేడియం నుంచి బయలు దేరాయి. ద్వితీయ, తృతీయశ్రేణి నాయకులు మాత్రం తమ సొంత, అద్దె కార్లలో వెళ్లారు. పట్టణంలో నుంచి బయలు దేరిన బస్సులకు ఆయా వార్డుల ఇన్‌చార్జిలు బాధ్యత తీసుకోగా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షుడు గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి తదితరులు పర్యవేక్షించారు.

● బిట్రగుంట,(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు పంచాయతీల నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు కడప మహానాడుకు గురువారం బయలుదేరారు. మండల పార్టీ కన్వీనర్ నాగేశ్వరరావు వాహనాలకు జెండా ఊపగా మహానాడు కదిలారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌బాబు, విజయ్‌కుమార్, మాధవరావు, వెంకటేశ్వర్లురెడ్డి, రామోహన్‌రెడ్డి, ఎస్.శీనయ్య, సుబ్బారెడ్డి, రంగయ్య, అమ్మద్‌బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే దగదర్తి మండలం నుంచి మాలేపాటి సోదరుల ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు గురువారం మహానాడుకు బయలు దేరారు. పార్టీ శ్రేణులను ఉత్సాహపరుస్తూ మాలేపాటి సుబ్బానాయుడు నినాదాలు చేశారు. యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు సారధ్యంలో మైదుకూరు చేరుకున్న మాలేపాటి సోదరులు సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు.

● వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళవళ్ల, అంకభూపాలపురం గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం మహానాడుకు తరవెళ్లారు. కడపకు వెళ్లినవారిలో నాయకులు మోదేపల్లి నారాయణ, ప్రగడ శ్రీనివాసులు, ప్రగడ మోహన్‌కుమార్, ప్రగడ నరసింహరావు, మంగి సురేష్, బత్తుల తిరుపతయ్య, ప్రగడ బలరామయ్య తదితరులు ఉన్నారు.



కొండాపురం మండలం నుంచి మహానాడుకు తరలుతున్న టీడీపీ నేతలు

● జలదంకి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 పంచాయతీల నుంచి వేలాదిగా టీడీపీ శ్రేణులు మహానాడుకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు బయలుదేరారు. మరికొందరు సొంత వాహనాలలో వెళ్లారు. మహిళలు కూడా ప్రతీ గ్రామం నుంచి వెళ్లారు.

● కలిగిరి, (ఆంధ్రజ్యోతి): మహానాడుకు మండలం నుంచి గురువారం బస్సులు, కార్లలో తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు. ఉదయం 10గంటలకు స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్దకు చేరుకొని, అక్కడ నుంచి పెద్ద సంఖ్యలో కడపకు బయలుదేరి వెళ్లారు.

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): మహానాడులో కందుకూరు నియోజకవర్గ నేతలు గురువారం సందడి చేశారు. మూడురోజులుగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతోపాటు ముఖ్యనేతలంతా మహానాడులోనే ఉండగా, గురువారం బహిరంగసభకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. నియోజకవర్గం నుంచి తరలివెళ్లిన కార్యకర్తలతో ఎమ్మెల్యే ఇంటూరి జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు తదితరులు సందడి చేశారు.

● కొండాపురం, (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన మహానాడుకు కొండాపురం మండలం నుంచి రెండు వేలమందికిపైగా నాయకులు, కార్యకర్తలు గురువారం తరలివెళ్లారు.ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశానుసారం మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోలినేని చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో సుమారు 25బస్సులు, 75కిపైగా కార్లలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.



కందుకూరు : మహానాడులో కార్యకర్తలతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు



కలిగిరి నుంచి మహానాడుకు తరలివెళ్తున్న తెలుగు తమ్ముళ్లు



బిట్రగుంట : మహానాడుకు బయలుదేరిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు

2 నుంచి ఇంటర్ తరగతులు

కందుకూరు, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూన్ 2 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఎంబైపీసీ, బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు నీట్, ఎంసెట్, లాసెట్, టీచర్‌ట్రైనింగ్ కోర్సులకు అవసరమైన మెటీరియల్ కూడా ఉచితంగా అందచేస్తామన్నారు. తమ కళాశాలలో చేరే విద్యార్థులకు తల్లికి వందనం పథకం ద్వారా ఏటా రూ. 15వేల స్కాలర్‌షిప్‌తో పాటు డొక్కా సీతమ్మ భోజనపథకం ద్వారా మధ్యాహ్నభోజనం అందచేస్తామన్నారు.

మతోన్మాదం నశించాలి : సీపీఎం



గుడ్లూరులో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

గుడ్లూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో రోజు రోజుకు పెరిగిపోతున్న మతోన్మాదం నశించాలని మండల సీఎంఎం కన్వీనర్ జీ. వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక హైస్కూల్ ప్రాంగణంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెగిశెట్టి వెంకటేశ్వర్లు, కొట్టే వెంకయ్య, గుత్తి మల్లికార్జున, ఎస్‌కే ఖాదర్‌బాషా, రామాల శ్రీనివాసుల రెడ్డి, సుంకరి విజయలక్ష్మి, కందులు సుబ్బయ్య పాల్గొన్నారు..

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న ఏవో సురేష్‌బాబు

కలిగిరి, మే 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారెడ్డిపాలెం, పెద్దకొండూరు, వెలగపాడు, అనంతపురం క్రాకుటూరు, పోలంపాడు రైతుసేవాకేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి మునునూరు సురేష్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో పచ్చిరొట్ట విత్తనాల కోసం నగదు చెల్లించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు గురువారం నుంచి పంపిణీ చేస్తున్నామన్నారు. వెలగపాడు ఆర్ఎస్‌కేలో పలువురు రైతులకు ఏవో పచ్చిరొట్ట విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో వీఏవో వెంకటేశ్వర్లు , రైతులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



జలదంకి, మే29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణక్రాక బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అప్పుడప్పుడు మంటలు రావడం, పేలుడుశబ్దాలతోపాటు తరచూ తీగలు తెగి కింద పడుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో నివాసాలు ఉండేవారితోపాటుగా ప్రయాణికులు భీతిల్లుతున్నారు. జనావాసాల మధ్య కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని స్థానికులు ట్రాన్స్‌కో అధికారులను కోరుతున్నారు.

జక్కా వెంకయ్యకు ఘన నివాళి





కావలి : జక్కా వెంకయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నేతలు,
బిట్రగుంట : వెంకయ్య చిత్రపటం వద్ద నివాలర్పిస్తున్న సీపీఎం నాయకులు

కావలి,మే29(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య వర్ధంతిని గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ జక్కా వెంకయ్య ఎంతో మంది పేదలకు భూములు పంచి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీ, మల్లికార్జున, ఎస్. వెంకయ్య, బీ.క్రిష్ణయ్య, మేడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల ఆశాజ్యోతి జక్కా వెంకయ్య

బిట్రగుంట, మే 29(ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల ఆశాజ్యోతి జక్కా వెంకయ్య అని మండల సీపీఎం సీనియర్ నేత తుమ్మల వెంకయ్య అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయంలో జక్కావెంకయ్య వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల సీఐటీయూ అధ్యక్షుడు చల్లా నరహరి, కామ్రేడ్స్ శంకరయ్య, భాస్కర్, ఎస్.రామయ్య, కోటమ్మ, ఎల్లయ్య, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు. దగదర్తి మండలం నారాయణపురంలో జక్కావెంకయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు జీ.రమేష్, చల్లామాల్యాద్రి, మహేష్, పీ.మాలాద్రి, సుధాకర్, వెంకటరమణ, మధు, రవి సీనయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో యోగా శిక్షణ



మున్సిపల్ కార్యాలయంలో యోగా ప్రాక్టీసు చేస్తున్న ప్రజలు

కందుకూరు, మే 29(ఆంధ్రజ్యోతి): యోగాడే సన్నాహకాల్లో భాగంగా గురువారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో యోగా ప్రాక్టీసు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కే. అనూష ఆధ్వర్యంలో పట్టణంలోని వార్డు సచివాలయాల పరిధిలో గుర్తించిన 170 మంది యోగా ప్రాక్టీషనర్లతో మున్సిపల్ కార్యాలయంలో యోగా శిక్షణ నిర్వహించారు. యోగా డేను కందుకూరులో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఇరువురి ఘర్షణ : ఒకరికి గాయాలు

కావలి రూరల్, మే29(ఆంధ్రజ్యోతి): పొలం గట్టుపై ఉన్న తాటిచెట్లను ఎక్స్‌కవేటర్‌తో పడేశారని కావలి మండలం కొత్తపల్లిలో గురువారం సాయంత్రం చిమ్మిలి సుబ్బరాయుడు, సోమినేని రామారావుల మధ్య ఘర్షణ జరిగింది. గ్రామంలోని పొలం మధ్యన ఉన్న గట్టుపై రామారావుకు చెందిన తాటిచెట్లను సుబ్బరాయుడు ఎక్స్‌కవేటర్‌తో తొలగించి రామారావు పొలంలో వేశాడు. ఈ విషయమై సుబ్బరాయుడును రామారావు నిలదీయటంతో ఇరువురు గ్రామంలోని సచివాలయం వద్ద ఘర్షణ పడ్డారు. అనంతరం కొంతసేపటి తరువాత ఇంటికి వెళ్తున్న సుబ్బరాయుడును దారికాచి రామారావు కుమారుడు పట్టుకోగా, రామారావు కత్తితో దాడి చేశాడు. దీంతో సుబ్బరాయుడి తల, కాలికి తీవ్ర రక్తగాయాలు కావటంతో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.



గాయపడిన సుబ్బరాయుడు



ఎడగారు సాగులో యాజమాన్య పద్ధతులు

● శైలజ, వ్యవసాయాధికారిణి

జలదంకి, మే29(ఆంధ్రజ్యోతి): ఎడగారు వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారిణి బీ.శైలజ పేర్కొన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఆమె తెలిపారు.

? : రెండో పంట వరి సాగుకు అనుకూలమైన రకాలు.

! : కేఎన్ఎం, ఎంటీయూ 1010 రకాల వరివంగడాలు అనుకూలం.

? : నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు ఏమిటీ.

! : నారుమడిని ముందుగా నీటితో నింపి ఉంచాలి. ఇలా రెండుమూడురోజులు ఉంచితే భూమిలో వేడి పోయి విత్తనాలు త్వరగా మొలకెత్తుతాయి. నారుమడి 10రోజుల వయసులో గుళికలు, జింక్, యూరియా పిచికారి చేసుకోవాలి. 22 రోజుల నుంచి 25రోజుల లోపు నాట్లు వేసుకోవాలి.

? : నాట్లు వేసేముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.

! : నాట్లు వేసేముందు మడులు దుక్కి చేసి కలుపు లేకుండా చేయాలి. మడిలో నీరు సమాంతరంగా ఉండేలా చూసుకుని నాట్లు వేయాలి. నాటులో సాళ్ళ తప్పనిసరిగా తీయాలి.

? : కలుపు నివారణ చర్యలేంటి.

! : నాట్లు వేసిన మూడోరోజు మడిలో పలుచగా నీరు ఉంచి, కలుపు మందు చల్లాలి.కొత్తగా నీరు మడిలో వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

న్యూస్ బాక్స్


వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



హోమంలో పాల్గొన్న భక్తులు

వలేటివారిపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకర్లపాలెంలో గురువారం సీతారాములు విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొని పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వేలాదిమంది భక్తులు రామాలయం వద్దకు చేరుకొని కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



లింగపాలెంలో శ్రామికుల మస్టర్లు పరిశీలిస్తున్న ఏపీవో దయాసాగర్

వలేటివారిపాలెం, మే 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగపాలెంలో జరుగుతున్న ఉపాధి హమీ పనులను గురువారం ఏపీవో దయాసాగర్ పరిశీలించారు. శ్రామికుల సమక్షంలో మస్టర్లను చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉపాధి హమీ శ్రామికుల విషయంలో జాగ్రతలు తీసుకోవాలన్నారు. కూలీ రూ. 307లు వచ్చేలా కొలతలు ప్రకారం పని చేయాలని, అందుకు టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు కృషి చేయాలని తెలిపారు.

89 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, మే 29(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 437పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 348బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-69, ఆర్ఆర్-14, సీఆర్-5, జంపింగ్‌లాట్స్-1 కారణాలతో 89బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.243.53గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి తెలిపారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755





శ్రీవారి మెట్టు మార్గాన నడిచి వస్తున్న భక్తులు

తిరుమలలో పెరిగిన రద్దీ

వేసవి సెలవులు చివరికి చేరుకోవడంతో తిరుమలకొండకు భక్తులు పోటెత్తారు. గురువారం నుంచే ఎటు చూసినా జనం కనిపిస్తున్నారు. క్యూలలోని సర్వద ర్శన భక్తులకు 16 గంటల దర్శన సమయం పడుతోంది. శ్రీవారిపాదాలు, అలిపిరి కాలినడకదారులు సైతం రద్దీగా మారాయి. - తిరుమల, ఆంధ్రజ్యోతి

హీరో శ్రీకాంత్ కుటుంబీకుల

నవగ్రహ శాంతిపూజలు

శ్రీకాళహస్తి పట్టణం సన్నిధివీధిలోని రాఘవేంద్ర స్వామి మఠంలో హీరో శ్రీకాంత్ కుటుంబ సమేతంగా గురువారం నవగ్రహ శాంతి పూజలు చేయించుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు. కాగా, ముక్కంటి ఆలయంలో పనిచేసేకొందరు అర్చకులు, పండితులు శ్రీకాంత్‌కు ప్రైవేటు పూజలు నిర్వహించడం, ఆ ఫోటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసుకోవడం విమర్శలకు తావిచ్చింది.

- శ్రీకాళహస్తి , ఆంధ్రజ్యోతి



తిరుమలలో శ్రియ

హీరోయిన్ శ్రియ గురువారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల పలువురు అభిమానులు ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. తిరుచానూరు పద్మావతి అమ్మవారిని, శ్రీకాళహస్తీశ్వరుడిని కూడా శ్రియ దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




కాలినడక భక్తుల భద్రతపై

టీటీడీ మరో ముందడుగు

- ఏడో మైలు వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు నిర్ణయం
- సోలార్ లైవ్ కెమెరాలకు పిల్లలతో చిక్కిన చిరుత, ఎలుగుబంటి



తిరుమల నడకమార్గంలో ఏడో మైలు వద్ద ఏర్పాటు చేసిన సోలార్ లైవ్ కెమెరాకు రెండు పిల్లలతో చిక్కిన ఎలుగుబంటి



సోలార్ కెమెరాకు చిక్కిన చిరుత, చిరుత పిల్ల

మంగళం, మే 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తుల భద్రతపై టీటీడీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. అలిపిరి- తిరుమల నడక మార్గంలోని ఏడో మైలు సమీప ప్రాంతాల్లో చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం ఎక్కువగా ఉందని గుర్తించింది. అందుకని ఇక్కడే శాశ్వత ప్రతిపాదికన కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు సిద్ధమైంది. గతంలో అలిపిరి నుంచి తిరుమలకు వెళ్లే ఈ నడకమార్గంలో భక్తులపై చిరుతలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో ఒక చిన్నారి తీవ్రంగా గాయపడగా, లక్షిత అనే బాలిక ప్రాణాలు కోల్పోయింది. అప్పట్లో కాలినడకన వెళ్లే భక్తులకు టీటీడీ కర్రలూ అందించింది. సాయంత్రం 6గంటల పైన నడకమార్గాన్ని మూసివేసింది. బోన్లు ఏర్పాటు చేసి నడకదారికి సమీపంలో వచ్చే చిరుతలను బంధించి కొన్నింటిని సుదూర అటవీప్రాంతాల్లో వదిలిపెట్టగా, మరికొన్నింటిని ఎస్వీ జూపార్కుకు తరలించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 26 సోలార్ లైవ్ కెమెరాలనూ ఆ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల్లో చిరుత, దాని పిల్ల చిక్కాయి. మరో కెమెరాలో రెండు పిల్లలతో ఉన్న ఎలుగుబంటి దృశ్యం రికార్డు అయింది. ఈ ప్రాంతంలో తరచూ ఎలుగుబంట్లు, చిరుతలు రాత్రి వేళలో ఎక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను ఏడో మైలు వద్ద ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

కంట్రోల్ రూమ్‌లోనే మానిటర్, రెస్క్యూటీం

ఇప్పటి వరకు నడక మార్గంలో రెస్క్యూటీంగా కొందరు ఉంటున్నారు. ఎక్కడైనా చిరుత, ఎలుగుబంట్లు ఉన్నట్లుగాని, నడక మార్గానికి దగ్గరగా వచ్చినట్లు గానీ తిరుపతిలోని బయోట్రిమ్ కార్యాలయానికి అందే సమాచారంతో వీరు అక్కడికి చేరుకుని వాటిని అడవిలోకి తరిమేలా చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు కంట్రోల్ రూమ్ ఏర్పాటైతే ప్రభుత్వ అటవీశాఖలోని ఇద్దరు బయాలజిస్టులు, పదిమంది సిబ్బంది, టీటీడీ అటవీశాఖ, విజిలెన్సు సిబ్బంది దాదాపు 30మంది ఇక్కడే ఉంటారు. కంట్రోల్ రూమ్‌లోని మానిటర్‌లో ఉన్న కెమెరాల ద్వారా వన్యప్రాణుల కదలికలను వీరు ఎప్పటికప్పుడు గమనిస్తూ చర్యలు తీసుకుంటారు. గతంలో ఇక్కడ ఎలివేటెడ్ పాస్ ఏర్పాటు చేస్తే మంచిదన్న నిపుణుల అభిప్రాయాలను మాత్రం ప్రస్తుతానికి టీటీడీ పక్కన పెట్టిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

టీచర్ల బదిలీల, పదోన్నతుల్లో అభ్యంతరాలు

- డీఈవో పట్ల ఫ్యాప్టో నేత అమర్యాదకర ప్రవర్తన
- సమస్యకు కారణమంటూ జీడీ నెల్లూరు ఎస్జీటీపై కమిషనర్‌కు డీఈవో ఫిర్యాదు

చిత్తూరు సెంట్రల్, మే 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఉత్పన్నమైన సమస్యలు, వాటి పరిష్కార వ్యవహారం గురువారం డీఈవో వరలక్ష్మి, ఫ్యాప్టో నాయకుల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది.పాఠశాల విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఈనెల 21న టీచర్ల బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి చిత్తూరు డీఈవో కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ సందర్భంగా టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఫ్యాప్టో నాయకులు లేవనెత్తిన సమస్యల్లో చాలావరకూ డీఈవో వరలక్ష్మి పరిష్కరించారు.సర్వీసు అంశాలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో పరిష్కరించాల్సిన ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ తయారీ క్రమంలో ఏపీ స్టేట్ సబార్డినేట్ సర్వీసు 33ఏ ప్రకారం ప్రస్తుత క్యాడర్, పీరియడ్, డేట్ ఆఫ్ బర్త్, మేల్, ఫిమేల్ సీనియారిటీ, 2021 బదిలీల్లో అర్హత సాధించి, రీఆపోర్షన్(షిఫ్టెడ్)కు గురైన టీచర్లకు పాత స్టేషన్ పాయింట్లు వర్తింపజేయాలనే దానిపై డీఈవోకు, ఫ్యాప్టో సంఘం నేతలకు మధ్య వాదనలు చోటు చేసుకున్నాయి. ఇతర జిల్లాల్లో పాటిస్తున్న విధానమే ఇక్కడా అమలు చేయాలని ఫ్యాప్టో నాయకుల పట్టుబడుతూ డీఈవో వరలక్ష్మిని చుట్టుముట్టారు.పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నుంచి వివరణ తీసుకుని సమాధానం ఇస్తామని డీఈవో చెబుతున్నా తిరుపతి జిల్లా ఫ్యాప్టో నాయకుడు,రామచంద్రాపురం మండలం అనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పీడీ సురేష్ ఆమెను ఏకవచనంతో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఇక్కడే నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించడంతో పక్కనే ఉన్న చిత్తూరు జిల్లా ఫ్యాప్టో నాయకులు అవాక్కయ్యారు.మహిళ అని కూడా చూడకుండా అమర్యాదగా ప్రవర్తించడాన్ని డీఈవో కార్యాలయ సిబ్బంది తీవ్రంగా ఖండించారు. సమస్య జటిలం కావడానికి జీడీ నెల్లూరు మండలం అగ్రహారం ఎంపీయూపీఎస్ పాఠశాల ఎస్జీటీ పి.విజయ్‌కుమార్ కారణమని విద్యాశాఖ అధికారులు కమిషనర్ విజయరామరాజుకు ఫిర్యాదు చేశారు.మూడు రోజులుగా డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతూ పలు అంశాలపై ఉపాధ్యాయ సంఘాల నేతలను రెచ్చగొడుతున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా బదిలీలకు సంబంధించి ఫ్యాప్టో నాయకులు లేవనెత్తిన అంశాల్లో ఒకటైన, ఉపాధ్యాయుల బదిలీల క్రమంలో 2021 అర్హత సాధించిన వారికి రీఅపోర్షన్ కింద 2025లో పాత స్టేషన్ పాయింట్లు వర్తిస్తాయని డీఈవో వరలక్ష్మి వివరణ ఇచ్చారు. ఫ్యాప్టో నాయకులు జీవీ రమణ, మణిగండన్, మునీర్ అహ్మద్, మునాఫ్, గోపీనాథ్, సోమశేఖర నాయుడు, మదనమోహన్‌రెడ్డి, చెంగల్రాయమండడి తదితరులు పాల్గొన్నారు.



డీఈవో వరలక్ష్మిని చుట్టుముట్టిన ఫ్యాప్టో నాయకులు

167మంది హెచ్‌ఎంల బదిలీ

ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ముగిసింది. జిల్లా పరిషత్ యాజమాన్యంలో 155 మంది, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఐదుగురు, మున్సిపాలిటీల్లోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు ఏడుగురు బదిలీ అయ్యారు.

ఎస్ఏలకు మొదలైన పదోన్నతి కౌన్సెలింగ్

స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎంల పదోన్నతి కౌన్సెలింగ్ గురువారం చిత్తూరులో మొదలైంది. జడ్పీ యాజమాన్యంలో 155, మున్సిపల్ కార్పొరేషన్లలో ఐదు, మున్సిపాలిటీల్లో ఐదు పోస్టులకు గాను 1:3 రేషియోలో 500 మంది ఎస్ఏలను పిలిచారు.

డీసీసీబీ నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా అమాస



చిత్తూరు కలెక్టరేట్, మే 29 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా అమాస రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు.ఈయన పదవీ బాధ్యతలు స్వీకరించిన తేది నుంచి 2025 జూన్ 26వ తేది వరకు లేదా ఎన్నికలు జరిగేంతవరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొంది.డీసీసీబీకి 2006లో జరిగిన ఎన్నికల్లో అమాస రాజశేఖరరెడ్డి చైర్మన్‌గా పోటీచేసి గెలుపొందారు.2011 వరకు ఆ పదవిలో కొనసాగిన ఆయన తరువాత జరిగిన ఎన్నికల్లో కూడా చైర్మన్‌గా ఎన్నికై మరో ఐదేళ్ల పాటు కొనసాగారు. అప్పటి ప్రభుత్వం సహకార సంస్థలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో 2019 వరకు అమాస రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని పాలకవర్గమే కొనసాగింది.2019లో వైసీపీ ప్రభుత్వం ఈ పాలకవర్గాన్ని రాజీనామా చేయించారు. దీంతో వడమాలపేట మండలం కాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి (సింగిల్‌విండో) అధ్యక్షుడిగా కొనసాగారు.కాగా ప్రస్తుతం డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జిగా జేసీ విద్యాధరి కొనసాగుతున్నారు. త్వరలోనే అమాస రాజశేఖర రెడ్డి బాధ్యతలు చేపట్టబోతున్నారు.

SRI PADMAVATI MAHILA VISVAVIDYALAYAM HOSTEL, TIRUPATI
(WOMEN'S UNIVERSITY)

TENDER NOTICE (BOX TENDERS)

TENDER NOTICE - PROVISIONS/RICE/VEGETABLES & MILK FOR SPMVV HOSTEL

Separate sealed tenders (Box Tenders) along with Tender document fee (TDF) are invited from Registered Agencies/ firms only in and around Tirupati for supply of the following items:

Tenderers have to pay the TDF fee Rs. 1,000/-.

Period of Tender : 6 months (From 1st July 2025 to 31st December 2025)

1. Rice - 6 Months
2. Provisions - 6 Months
3. Vegetables - 6 Months
4. Milk - 6 Months

} Valid from the date of receipt of the order

TDF by means of DD to be drawn in f/o the Registrar, Sri Padmavati Mahila Visvavidyalyam, Tirupati.

Date of issue of Tender Forms : 02-06-2025 to 10-06-2025 (7 working days)
Last Date & Time of receipt of Bids : 10-06-2025 before 05.00 P.M.
Date & Time of opening of Bids : 12-06-2025 at 11.00 A.M. For all items.

Please visit our website www.spmvv.ac.in for details estt./ SPMVV Hostel/Tenders/ 2025.

Sd/- **REGISTRAR**



నేటి నుంచి టోల్ గేట్ వసూళ్లు

ఏర్పేడు, మే 29(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని మేర్లపాక సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై శుక్రవారం నుంచి టోల్ చార్జీలు వసూలు చేయనున్నారు. జాతీయ రహదారికి సంబంధించిన అధికారులు మూడు రోజులుగా ట్రయల్స్ వేశారు. కారుకు రూ.140, బస్సు, ట్రక్కులకు రూ.470 చొప్పున వసూలు చేయనున్నట్లు బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ టోల్‌గేట్‌కు ఇరువైపులా 20 కిలోమీటర్ల మేరకు ఉన్న వైట్ బోర్డు వాహనదారులు నెలకు రూ.350 చెల్లించి పాస్ తీసుకోవాల్సి ఉంటుంది.

అమరరాజ ఎనర్జీ & మొబిలిటీ లిమిటెడ్

(గతంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్‌గా పిలువబడేది)

CIN: L31402AP1985PLC005305

నమోదిత కార్యాలయం: రేణిగుంట – కడప రోడ్, కరకంబాడి, తిరుపతి– 517520, ఆంధ్రప్రదేశ్

ఫోన్: 91 (877) 2265000, ఫ్యాక్స్: 91 (877) 2285600.

ఇమెయిల్ ఐడి: investorservices@amararaja.com వెబ్‌సైట్: www.amararajaeandm.com

AMARA RAJA
Gotta be a better way

31 మార్చి 2025తో ముగిసిన త్రైమాసిక మరియు వార్షిక కాలానికి స్వతంత్ర మరియు ఏకీకృత ఫలితాల నివేదిక నుండి సంగ్రహం

రూ.కోట్లలో

వివరాలు	స్వతంత్ర ఫలితాలు					ఏకీకృత ఫలితాలు				
	ఈ తేదీలతో ముగిసిన త్రైమాసిక కాలం			ఈ తేదీలతో ముగిసిన వార్షిక కాలం		ఈ తేదీలతో ముగిసిన త్రైమాసిక కాలం			ఈ తేదీలతో ముగిసిన వార్షిక కాలం	
	31.03.2025	31.12.2024	31.03.2024	31.03.2025	31.03.2024	31.03.2025	31.12.2024	31.03.2024	31.03.2025	31.03.2024
	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ అయినవి	ఆడిట్ అయినవి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ కానివి	ఆడిట్ అయినవి	ఆడిట్ అయినవి
కార్యకలాపాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం	2,973.85	3,164.02	2,796.73	12,404.89	11,260.30	3,060.07	3,272.47	2,907.86	12,846.32	11,708.44
సదరు వ్యవధికి నికర లాభం (పన్ను, మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంలకు ముందు)	224.36	311.09	305.34	1,188.08	1,211.03	212.62	297.70	309.39	1,162.10	1,250.22
పన్నుకు ముందు వ్యవధికి నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తర్వాత)	224.36	422.16	305.34	1,299.15	1,211.03	212.62	408.77	309.39	1,273.17	1,250.22
పన్ను తర్వాత వ్యవధికి నికర లాభం (మినహాయింపుగల మరియు/లేదా అసాధారణ ఐటంల తర్వాత)	166.81	311.83	228.03	963.90	905.86	161.57	298.37	229.78	944.67	934.38
సదరు వ్యవధికి మొత్తము సమగ్ర ఆదాయం (పన్ను తర్వాత లాభంతోపాటు మరియు పన్ను తర్వాత ఇతర సమగ్ర ఆదాయం)	58.60	180.00	223.74	799.97	899.66	53.67	166.64	225.85	780.75	928.34
చెల్లించిన ఈక్విటీ వాటామూలధనం (ముఖ విలువ రూ. 1/- ఒక్కింటికి)	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30	18.30
ఆడిట్ చేసిన ఆస్తి అప్పులపట్టీలో చూపిన విధంగా రిజర్వులు (రీవాల్యుయేషన్ రిజర్వు మినహా)				7,359.97	6,750.35				7,370.83	6,780.43
ప్రతి వాటాకు వచ్చిన ఆర్జనలు (రూ. 1/- ఒక్కింటికి) (సదరు కాలానికి -వార్షీకరించబడలేదు) -బేసిక్ & డైల్యూటెడ్	9.11	17.04	12.46	52.66	49.49	8.83	16.30	12.55	51.62	51.05

గమనిక: SEBI(లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్- 33 ప్రకారం స్టాక్ ఎక్స్ఛేంజిలకు దాఖలు చేసిన స్వతంత్ర మరియు ఏకీకృత ఆర్థిక ఫలితాల సంగ్రహమే పైన పేర్కొనబడినది. త్రైమాసిక/తొమ్మిది నెలల ఆర్థిక ఫలితాల మరియు అపై నోట్స్ యొక్క సమగ్ర నమూనా స్టాక్ ఎక్స్ఛేంజి వెబ్‌సైట్స్ (www.nseindia.com మరియు www.bseindia.com) నందు మరియు కంపెనీ వెబ్‌సైట్ అనగా www.amararajaeandm.com నందు లభ్యమగును.

స్థలం: హైదరాబాద్
తేది: 29 మే, 2025

అమరరాజ ఎనర్జీ & మొబిలిటీ లిమిటెడ్ తరపున
(గతంలో అమరరాజ బ్యాటరీస్ లిమిటెడ్‌గా పిలువబడేది)
జయదేవ్ గల్లా
DIN: 00143610 | చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ & CEO

ఒక రోజు ముందే

పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), మే 29(ఆంధ్రజ్యోతి): జూన్ నెలకు సంబంధించిన పింఛన్లను ఒకరోజు ముందుగానే శనివారం పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జూన్ ఒకటిన ఆదివారం కావడంతో.. మే 31న పంపిణీ చేయలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,60,379 మందికి సుమారు రూ.117.4 కోట్ల పింఛను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 6.30 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించారు.





మహానాడు సభ వద్ద చంద్రబాబుతో చంద్రగిరి, పలమనేరు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, అమరనాథరెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీటీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి



మహానాడులో పార్టీ నిధికి రూ.5లక్షలు

- విరాళం అందించిన 'కోడూరు'

తిరుపతి, మే 29 (ఆంధ్రజ్యోతి): మహానాడులో టీడీపీ అధినేత, సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా పార్టీ నిధికి రూ.5లక్షల విరాళాన్ని ఆ పార్టీ నేత డాక్టర్ కోదూరు బాలసుబ్రమణ్యం చెక్కు రూపంలో అందించారు. అలాగే, బాలాజీ, ఎలైట్ ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో మహానాడులో 22 అంబులెన్సులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందజేశారు.

ఆటాడుకుందామా!

గురువారం చల్లని మధ్యాహ్నం వేళ
తిరుపతి జూపార్క్‌లో కనిపించిన దృశ్యాలు

- ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుపతి



మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సు రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో చూడాలని వర్సిటీ పరీక్షల అధికారి రాజమాణిక్యం తెలిపారు. రీ వాల్యుయేషన్ కోసం జూన్ 9 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

సంస్కృత వర్సిటీలో దూరవిద్యకు దరఖాస్తుల ఆహ్వానం

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం దూరవిద్యా విభాగంలో పలు కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమో, ప్రాక్ శాస్త్రి కోర్సులకు నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 8 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర సమాచారం కోసం.. 94402 26562 నెంబరులో సంప్రదించాలని ఆ వర్సిటీ దూరవిద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ రంగనాథ్ కోరారు.

ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఎన్‌బీఏ గుర్తింపు



ఎన్‌బీఏ గుర్తింపు ధ్రువీకరణ పత్రంతో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 29 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ నిర్వహిస్తున్న పలు కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. ఇంజనీరింగ్ కాలేజీ పాటిస్తున్న బోధన, ఫలితాలు, సదుపాయాలు, ప్రమాణాలను ఈ నెల 7 నుంచీ మూడు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ గుర్తింపు ప్రకటించారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాల ప్రగతిని ఎన్‌బీఏ బృందం అధ్యయనం చేసి ఈ గుర్తింపు ప్రకటించింది. దీనిపై ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కో-ఆర్డినేటర్ వెంకట్రామయ్య, డీన్ దామోదరరెడ్డి, ప్రొఫెసర్ రమాశ్రీ, ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఇంతకీ ఏం జరిగింది?

- నాయుడుపేట లాడ్జీలో ఇద్దరి మృతి
- యువకుడి మెడ కోసి ఉండటంతో అనుమానాలు
- యువతి ఉరేసుకుని ఆత్మహత్య
- అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు



లాడ్జీవద్ద రోదిస్తున్న శిరీష కుటుంబీకులు

నాయుడుపేట టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. ఆమె భర్తతో విడిపోయింది. అతడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అలాంటిది.. మణి(35), శిరీష (25) మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఏం జరిగిందో ఏమోగానీ.. గురువారం నాయుడుపేటలోని లాడ్జీలో ఇద్దరూ మృతిచెందారు. అతడి గొంతు కోసి ఉండగా.. ఆమె ఉరేసుకుంది. అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళెం గ్రామానికి చెందిన మణికి పెళ్లయింది. భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇక, శిరీషను చిన్నప్పుడే ఆమె తల్లి విజయమ్మ కుప్పరెడ్డిపాళెంలో నాయనమ్మ గురవమ్మ, లాజరస్ దంపతులకు అప్పగించింది. వాళ్లు పెంచి శ్రీకాళహస్తి సమీపంలోని సమీప బంధువుకు ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలం తరువాత ఆమె విడాకులు తీసుకొని కుప్పరెడ్డిపాళెంలో నాయనమ్మ దగ్గర ఉంటుంది. ఈ క్రమంలో మణితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీంతో మణి ఇంట్లో గొడవలు రేగాయి. కొద్ది రోజుల కిందట అతడి భార్య పుట్టింటికి అలిగివెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలో బుధవారం రాత్రి 8 గంటల సమయంలో మణి, శిరీష నాయుడుపేట బస్టాండు సమీపంలోని ఓ లాడ్జీలో గదిని అద్దెకు తీసుకున్నారు. గురువారం ఉదయం 8.30 గంటల సమయంలోనూ లాడ్జీ సిబ్బందితో మాట్లాడారు. ఆ తర్వాత గదిలోకి వెళ్లిన వీరు.. ఎంతసేపటికీ బయటకు రాలేదు. అనుమానం వచ్చిన సిబ్బంది కిటికిలో నుంచి చూడగా శిరీష ఉరేసుకుని.. మణి గొంతుకోసుకొని అధిక రక్తస్రావంతో పడి ఉండటాన్ని గుర్తించారు. వీరి సమాచారంతో డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, ఎస్‌ఐ నాగలక్ష్మి మృతదేహాలను పరిశీలించారు. అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేశారు.

ఎన్నో అనుమానాలు?

మణి గొంతు కత్తితో చాలా లోతుగా తెగిఉండటం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తనే కోసుకుని ఆత్మహత్య చేసుకొని ఉంటే అంతలోతుగా తెగి ఉండదని భావిస్తున్నారు. వాష్ బేసిన్లో రక్తపు మరకలు ఉండటంతో.. ఇక్కడ చేతులు కడిగి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఉరేసుకుని చనిపోయిన శిరీష చేతికీ రక్తపు మరకలు ఉండటాన్ని గుర్తించారు. దీంతో వీరిద్దరి మధ్య ఏం జరిగిందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఆ గదికి గడియ వేసుండటంతో మూడో వ్యక్తి వచ్చిపోయే అవకాశం లేదు. అనుమానాస్పద స్థితిలో మృతిగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య సంరక్షణకు 'యోగా'

మంగళం/తిరుపతి(క్రీడలు/కలెక్టరేట్), మే 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణకు ప్రతి ఒక్కరు యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని, యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం తిరుపతిలోని ఎస్వీ జూపార్కు వద్ద యోగా శిక్షణ నిర్వహించారు. ప్రతి ఒక్కరు మరో నలుగురితో యోగా చేయించాలన్నారు. ఇప్పటి వరకు గుర్తించి మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఈనెలాఖరు వరకు శిక్షణ కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్, జేసీ శుభంబన్సల్, జూ క్యూరేటర్ సెల్వం, డీఎఫ్‌వో వివేక్ వివిధ విభాగాల అధికారులు రామ్మోహన్, విక్రమ్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణనాయక్, జనార్దన్‌రెడ్డి, చరణ్‌తేజ్ రెడ్డి, సిబ్బంది యోగాసనాలు వేశారు. సాయంత్రం కలెక్టర్, జేసీ, కమిషనర్ మౌర్య యోగాంధ్ర నిర్వహణ, యోగాంధ్ర యాప్‌లో నమోదుపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. యాప్‌లో పది లక్షలమంది నమోదుకు లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటివరకు 1.30 లక్షలు మాత్రమే నమోదవడం అసంతృప్తి వ్యక్తం చేశారు.





జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్), మే 29 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువును మరో మూడు నెలలు పొడిగించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరుతో గడువు ముగియనున్న నేపథ్యంలో ఆగస్టు 31 వరకు పొడిగించనున్నట్లు పేర్కొన్నారు. మీడియా సంస్థలో జర్నలిస్టుల వివరాలను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో త్వరగా అందజేయాలన్నారు.



కడపలో జరిగిన మహానాడు బహిరంగ సభ వేదికపై మంత్రి నారాయణ, ఎమ్మెల్యే బీద రవిచంద్ర



రాపూరు చెక్‌పోస్టు వద్ద కడపకు వెళుతున్న వాహనాలకు జెండా ఊపుతున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి

తమ్ముళ్ల సంబరం

భారీగా కడపకు తరలిన టీడీపీ శ్రేణులు

కడపలో మహానాడు బహిరంగ సభకు జిల్లా నుంచి తెలుగు తమ్ముళ్లు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పయనమయ్యారు. గురువారం వేకువజాము నుంచే జిల్లావ్యాప్తంగా తెలుగుదేశం శ్రేణుల కోలాహలం కనిపించింది. బుధవారం రాత్రే మహానాడు నుంచి తమ నియోజకవర్గ కేంద్రాలకు చేరుకున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు జన సమీకరణపై దృష్టి సారించారు. అర్ధరాత్రికి ప్రత్యేక వాహనాలు, ఆర్టీసీ బస్సులు కేటాయించిన గ్రామాలకు చేరుకున్నాయి. వేకువ జామునుంచే పల్లెల్లో తెలుగు పండుగ వాతావరణం కనిపించింది. మండల కేంద్రాల నుంచి నియోజకవర్గ కేంద్రానికి చేరుకున్న వాహనాలను ఎమ్మెల్యేలు జెండాలు ఊపి కడపకు సాగనంపారు. వాటి వెంటే ఎమ్మెల్యేలు కడపకు పయనం అయ్యారు. ఐదేళ్ల కష్టాల తరువాత అధికారంలోకి వచ్చిన ఉత్సాహం తెలుగు దేశం కార్యకర్తల్లో కనిపించింది. అధికార దర్పంతో ప్రత్యేక వాహనాలు ఎక్కి కడప బహిరంగ సభకు తరలివెళ్లారు. జిల్లా నుంచి సుమారుగా 60-70 వేల మంది కార్యకర్తలు మహానాడు బహిరంగ సభకు తరలివెళ్లినట్లు అంచనా.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



వింజమూరులో జెండా ఊపి వాహనాలన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



బుచ్చిరెడ్డిపాళెం : కడపకు వెళుతున్న టీడీపీ శ్రేణులతో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ తదితరులు



ఉదయగిరి నుంచి మహానాడుకు తరలుతున్న టీడీపీ శ్రేణులు

ఉపాధ్యాయ పదోన్నతులకు ఎదురుచూపులు

- రాత్రి ప్రారంభమైన ఎస్‌ఏల ప్రక్రియ

నెల్లూరు (విద్య), మే 29 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ అసిస్టెంట్లకు షెడ్యూల్ ప్రకారం ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించలేక పోయిన విద్యా శాఖ రెండోరోజు కూడా రాత్రి వరకు ప్రారంభించలేకపోయింది. దీంతో గురువారం ఉదయం నుంచే ఎస్‌ఏ ఉపాధ్యాయులు నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణకు చేరుకోవడంతో కోలాహలంగా మారింది. సీనియారిటీ జాబితా, రోస్టర్ పాయింట్ల కేటాయింపులు కూడా ఆలస్యం కావడం, ఇతర సాంకేతిక కారణాలతో గురువారం రాత్రి 8 గంటల వరకు ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పలేదు. చివరకు 8 గంటలపైన అధికారులు చేపట్టినా అభ్యంతరాల నడుమ కొనసాగుతుండటంతో ఏ సమయంలో పూర్తవుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు మాత్రం ఈ ప్రక్రియను సామరస్యంగా పూర్తి చేస్తామని, ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన పరిస్థితులు కల్పించమన్నారు. ప్రధానోపాధ్యాయులకు సంబంధించి 101 మందికి బదిలీలు నిర్వహించి ఉత్తర్వులు ఇవ్వగా, ప్రస్తుతం జరిగే ఎస్‌ఏలకు బదిలీ అయిన స్థానాల్లో ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు తెలిపారు.



కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులు

భలే భలే బంగినపల్లి!

- ఊపందుకున్న పండుమామిడి మార్కెట్
- వర్షాలకు ఒక్కసారిగా కోతకు వచ్చిన కాయలు
- పక్క జిల్లాల నుంచి వస్తున్న రోజువారి బేరగాళ్లు

ఉలవపాడు, మే 29 (ఆంధ్రజ్యోతి) : బంగినపల్లి మామిడి ఆరగిద్దామని ఎదురుచూసే ఫలరాజుప్రియుల కోరిక తీరుతోంది. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు, మధ్య మధ్యలో ఎండ వేడికి బంగినపల్లి త్వరితగతిన పక్వానికి వచ్చింది. ఉలవపాడులోని ఎమ్పీడీవో కార్యాలయ సమీపంలోని ఖాళీ స్థలంలో పండు మామిడి మార్కెట్ మొదలైంది. సహజంగా మే నెల మూడో వారం నుంచి అడపాదడపా ముందస్తు మామిడి కోతకు వస్తే ఆటోల్లో మార్కెట్‌కు తరలించి సాగుదారు వ్యాపారం సాగించేవాడు. అయితే, ఈసారి మాత్రం రోజు మార్చి రోజు వర్షం కురవడం, ఒక్కోరోజు పగలు ఎండ తీవ్రత అధికంగా ఉండటం వెంటనే రాత్రిపూట వర్షం కురవటంతో మామిడి ముందస్తు పంట దశకు చేరింది. దీంతో చెట్టుకు పండిన కాయలు దిగుమతికి వస్తున్నాయి. మార్కెట్‌లో కిలో లెక్కన కాకుండా ట్రేల లెక్కన అమ్మకాలు జరుపుతుంటారు. ఒక్కో ట్రేలో పెద్ద సైజు బంగినపల్లి మామిడి 40 కాయలు వరకు పడతాయి. మధ్యస్థ సైజు కాయలు 50 పట్టే అవకాశం ఉంది. నాణ్యతను బట్టి ఒక్కో ట్రే ధర ప్రస్తుతం రూ.600 నుంచి 800 వరకు విక్రయిస్తున్నారు.

పక్క జిల్లాల బేరగాళ్లు

తోటల్లో పక్వానికి వచ్చిన బంగినపల్లి మామిడి ఎగుమతికి అవకాశం లేనందున ఉలవపాడు చుట్టుపక్కల మండలాల నుంచి ప్రతిరోజు పదుల సంఖ్యలో ఆటోల్లో మార్కెట్‌కు తరలిస్తుంటారు. మే మూడోవారం మొదలు పండు మామిడి మార్కెట్ సీజన్ మొదలవుతుందని తెలిసిన ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల నుంచి రోజువారి బేరగాళ్లు ఉలవపాడులో మకాం మారుస్తారు. పగలంతా వ్యాపారం చేయడం రాత్రికి పక్కనే ఉన్న సాయిబాబా మందిరం ప్రాంగణంలో వసతి పొందుతున్నారు. ప్రతిరోజు తెనాలి, బాపట్ల, చీరాల, వేటపాలెం, ఒంగోలు మీదగా ఉలవపాడుకు వచ్చే ప్యాసింజర్ రైలులోనూ మహిళా వ్యాపారులు వచ్చి తమకు కావాల్సిన సరుకును కొనుగోలు చేసి తిరిగి ప్యాసింజర్ రైలులోనే వెళుతుంటారు. సుమారు రెండు నెలలపాటు ఇదేవిధంగా పక్క జిల్లాల బేరగాళ్లు వస్తుంటారు.



ఏడాదికి ఒకసారి.. అందాన్ని విరబూసి!


పుష్పాలు అంటేనే అందంతో మిళితమై పరిమళ సువాసనలు వెదజల్లుతాయి. ప్రకృతిప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. కొన్ని పూలు సంవత్సరం పొడవునా పూస్తుండగా, ఇంకొన్ని మాత్రం ఒకసారి మాత్రమే పూస్తాయి. అలాంటి కోవకు చెందినవే మే పుష్పాలు. బోగోలు మండలం కడనూతల గ్రామంలో బీ.జయకుమార్ మాస్టారు ఇంట్లో బూసిన 'మే' పుష్పాలను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

- బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి



ఉత్సవాల్లోనైనా వసతులు కల్పిస్తారా!?

- వచ్చే నెల 15 నుంచి వెంగమాంబ బ్రహ్మోత్సవాలు
- నేడు సమన్వయకమిటీ సమావేశం



శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయం

ఉదయగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాల ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాల కల్పనపై ఆలయ ఆవరణలో కావలి ఆర్డీవో వంశీకృష్ణ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం జరగనుంది. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఆంధ్రాతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఈ ఉత్సవాలకు తరలివస్తారు. అయితే, వ్యయప్రయాసలు పడి వచ్చే భక్తులకు వసతుల కల్పనలో మాత్రం అధికార యంత్రాంగం విఫలమవుతూనే ఉంది. ఈ ఏడాదైనా అన్ని సౌకర్యాలు కల్పించి అమ్మవారి దర్శనం సజావుగా జరిగేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

- ఉత్సవాల సమయంలో పూజా సామగ్రి, ఇతరత్రా వస్తువులు అధిక ధరలకు విక్రయిస్తుంటారు. ఫిర్యాదులు అందుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.
- ఇక మద్యం విక్రయాలకు అడ్డూఅదుపు లేదు. ఎక్కడపడితే అక్కడ అధిక ధరలకు మద్యం అమ్ముతుండటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఉత్సవాల వేళ మద్యం విక్రయాలను నిరోధించాల్సి ఉంది.
- అమ్మవారి లడ్డూ ప్రసాదంలో నాణ్యత తగ్గుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రద్దీ దృష్ట్యా అవసరమైన ప్రాంతాల్లో మంచినీటి సదుపాయం కల్పించాలి.
- బ్రహ్మోత్సవాల చివరి రెండు రోజుల్లో భక్తుల తాకిడి అధికం. ఆ సమయంలో దొంగతనాలు విపరీతంగా జరుగుతుంటాయి. వాటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అమ్మవారి దర్శనానికి వృద్ధులు, దివ్యాంగులకు క్యూలైన్లు ఏర్పాటు చేయాలి. అలాగే మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి.

వృక్ష సంపద పెరిగిందా.. తరిగిందా!?

ఉదయగిరి, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి అటవీ శాఖ పరిధిలోని పలు అటవీ ప్రాంతాలను గురువారం ఫారెస్టు సర్వే ఆఫ్ ఇండియా డెహ్రాడూన్ బృందం పరిశీలించింది. బృంద సభ్యులు ఇంతియాజ్‌సీ, పీ.అధికారి స్థానిక అటవీ సిబ్బందితో కలిసి దుత్తలూరు, నందిపాడు, ఉదయగిరి, ఆర్లపడియ, సీతారామపురం బీట్‌లను పరిశీలించారు. ఆయా బీట్‌లలో ఏ ఏ వృక్ష జాతులు ఉన్నాయి, వాటి ఎదుగుదల ఎలా ఉంది, వృక్షాల పెరుగుదల తగ్గిందా, పెరిగిందా తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. బృందం వెంట రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా, డీఆర్వో మురళి, ఎఫ్‌బీవోలు ఓంప్రకాష్, చిన్నపురెడ్డి, లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అడవులను పరిశీలిస్తున్న డెహ్రాడూన్ బృందం

జక్కా వెంకయ్యకు నివాళి


వెంకయ్యకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే జక్కా వెంకయ్య వర్ధంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి ఎస్‌కె రియాజ్ ఆధ్వర్యంలో వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. రియాజ్ మాట్లాడుతూ వెంకయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అల్లెయ్య, సీహెచ్ చంద్రశేఖర్, సుధాకర్ రావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం ఆధ్వర్యంలో జక్కా వెంకయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో శివకుమార్, వెంక్రటామిరెడ్డి, బీవీరమణయ్య, కోటేశ్వరరావు, మణి, ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేషన్ షాపులకు సరుకుల చేరవేత



సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో అధికారులు చౌక దుకాణాల నుంచి డీలర్ల ద్వారా రేషన్ సరకులను పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సూళ్లూరుపేట సివిల్ సప్లయ్ గోదాం నుంచి రేషన్ సరకులను ఆయా చౌక దుకాణాలకు వాహనాల ద్వారా చేర్చుతున్నారు. సూళ్లూరుపేట సివిల్ సప్లయ్ పరిధిలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో 121 చౌక దుకాణాలు ఉన్నాయి. ఇప్పటికే 80 చౌక దుకాణాలకు రేషన్ బియ్యం, చక్కెర అందజేసినట్లు సివిల్ సప్లయ్ గోదాం ఇన్‌చార్జీ తులసిరామ్ తెలిపారు. కందిపప్పు రాగానే అందజేస్తామన్నారు.

పాఠశాలకు వాటర్‌కూలర్ వితరణ



గూడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూలతోట గిరిజన కాలనీలోని సరస్వతి శిశు మందిరం పాఠశాలకు గురువారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో హనుమంత రావు వాటర్‌కూలర్‌తో పాటు పలు వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, మునిగిరీష్, జీజీనాయుడు, మయూరి శ్యామ్‌యాదవ్, మురళీరెడ్డి, హనుమంతరావు, శశిధర్, రమణబాబు, దశరధరామిరెడ్డి, రంగనాయకులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యతా యాత్ర



గూడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద నిర్మూలనకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో సమైక్యతాయాత్రను నిర్వహించారు. సీపీఎం కార్యాలయం నుంచి వివేకానందారోడ్డు, ముత్యాలపేట మీదుగా టవర్‌క్లాక్‌సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. శివకుమార్, బీవీ.రమణయ్య, వెంకట్రామిరెడ్డి, మణి, ప్రసాద్, మధు, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, నారాయణ, చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఇంటిదొంగ


సబ్‌స్టేషన్ వద్ద పట్టుబడిన స్ర్కాప్ ఆటో

గూడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): నెల్లటూరు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ స్ర్కాప్‌ను అక్రమంగా ఓ ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నారు. స్థానికుల వివరాల మేరకు... సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టు షిఫ్టు ఆపరేటర్‌గా పని చేస్తున్న నవీన్ బుధవారం అర్ధరాత్రి విద్యుత్‌స్టోర్స్‌కు చెందిన స్ర్కాప్‌ను ఆటోలో అక్రమంగా తరలిస్తున్నాడు. వ్యాచ్‌మన్లు చూసి ఆటోను పట్టుకుని బాధ్యులైన అధికారులకు తెలియజేశారు. విధులు నిర్వహించే సిబ్బందే ఇలాంటి చర్యలకు పాల్పడటంపై స్థానికులు విస్తుపోన్నారు. విద్యుత్‌స్టోర్స్ ఏడీ శంకరయ్యను వివరణ కోరగా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పూర్తి స్థాయిలో విచారిస్తామన్నారు. చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేస్తాం


అధికారులతో మాట్లాడుతున్న వెంకటరమణ

వెంకటగిరిటౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరలోనే సుందరీకరిస్తామని ఆర్టీసీ చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ(విజయవాడ)అన్నారు. గురువారం స్థానిక బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో పెయింట్, బస్టాండ్ మరమత్తులు, మరుగుదొడ్లు, కుర్చీలు, ఫ్యాన్స్ వంటివి చేయించి ఆధునీకరిస్తామన్నారు. మరిన్ని ఆర్టీసీ సర్వీసులను నడుపుతామమన్నారు. కార్యక్రమంలో తిరుపతి డీప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చెన్నకేశవ, ఆర్టీసీ డిపో మేనేజరు రామకృష్ణ, ఏఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చిన్నదర్గా ఉరుసు



నాయుడుపేట టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిన్నదర్గా ఉరుసును వైభవంగా నిర్వహిస్తున్నారు. మొదటి రోజు గురువారం విద్యుత్ దీపాలంకరణలో ఉన్న చిన్నదర్గాలో పలువురు మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఊరేగింపుగా గంధం తెచ్చి చిన్నదర్గా వద్ద చదివింపులయ్యాక అందరికీ పంచిపెడతారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): హోలిక్రాస్ సర్కిల్ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు తడ మండలం వేనాడుమూల గ్రామానికి గూటాం చిన్నయ్య (45) సూలూరుపేట హోలిక్రాస్ సమీపంలోని రైస్‌మిల్లులో ఒడ్లు దంపించేందుకు ఆటోలో ధాన్యం బస్తాలను పంపాడు. వెనుక మోటారు సైకిల్‌పై అనుసరించాడు. హోలిక్రాస్ సర్కిల్ జాతీయ రహదారిపై చెన్నైవైపు వెళ్లే మినీలారీ ఇతడిని ఢీకొంది. చిన్నయ్య ఎగిరి డివైడర్‌పై పడడంతో తలకు తీవ్రగాయమైంది. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసి చెన్నై తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ సాధారణ కౌన్సిల్ సమావేశం శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో జరగనుంది. మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. మున్సిపాలిటీ కమిషనర్ కె.చిన్నయ్య ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులందరూ తప్పకుండా హాజరు కావాలని పేర్కొన్నారు.

సుందరకాండ యాగ పూజలు



గూడూరు అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉప పీఠంలో గురువారం సుందరకాండ యాగ హోమపూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఆంజనేయస్వామి సుందరకాండ యాగాన్ని నిర్వహించామన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో నిషాన్



గూడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గావీధిలోని హజరత్‌సయ్యద్ హషీమ్ హుస్సేనీ ఔలియా దర్గాలో బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిషాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిషాన్ జెండాను ఊరేగించి దర్గా వద్ద ఆవిష్కరించారు. మత గురువులు, ముస్లింలు ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో రియాజ్‌అహ్మద్, మగ్దూం, ఇలియాజ్‌అహ్మద్, షాన్‌వాజ్, యస్థానీ, సందానీ, దిల్‌దార్, కమర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆటో



వెంకటగిరిటౌన్, మే 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా రైల్వేస్టేషన్ వెళ్తున్న ఆటో కైవల్యానది కాలవలోకి దూసుకెళ్లింది. స్థానికులు కథనం మేరకు. గురువారం నది పాత బ్రిడ్జి రోడ్డుపై ఆటో రైల్వే స్టేషన్‌కు వెళ్తుంది. ఈక్రమంలో మద్యం తాగి ఉన్న డ్రయివర్ ఆటోను స్టార్ట్ చేసి రోడ్డుపక్కన ఉంచాడు. దీంతో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ప్రయాణికులు ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎస్‌ఐ సుబ్బారావు అక్కడకు చేరుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

ఉర్దూ తరగతుల నిర్వహణకు ఆదేశాలు

కోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల, వాకాడులోని ప్రాథమిక పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఉర్దూ తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించుకోవాలని డీఈవో కేవీఎన్ కుమార్ ఆదేశించారని ఎంఈఓ మస్తానయ్య తెలిపారు. ఈ పాఠశాలల్లో ఇటీవల రేషనలైజేషన్‌కింద 3,4,5 తరగతులను ఎత్తేశారు. ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేశారు. ఈ విషయం ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ దృష్టికి టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ తీసుకువచ్చారు. ఎమ్మెల్యే చొరవతో తిరిగి తరగతులు పునరుద్ధరణతోపాటు ఉర్దూ ఉపాధ్యాయుల నియామకానికి అనుమతి లభించిందని మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు.. జూన్ 2న పలు రైళ్ల రద్దు

తడ, మే 29 (ఆంధ్రజ్యోతి) : సదరన్ రైల్వే పరిధిలో శనివారం, జూన్ 2న పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు చెన్నై డివిజన్ సదరన్ రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. తమిళనాడు, గుమ్మిడిపూడి, కవర్‌పేట రైల్వే స్టేషన్‌ల మధ్య ఇంజనీరింగ్ సిగ్నల్ వ్యవస్థ మాక్ పనులు జరుగుతున్న క్రమంలో ఈమేరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. కొన్ని రైళ్లను చెన్నై, మీజూరుల మధ్య నడపనున్నారు.

రద్దయిన రైళ్ల వివరాలు

- చెన్నై నుంచి సూళ్లూరుపేటకు వచ్చే ఈఎంయూ
- సూళ్లూరుపేట- చెన్నై మెము, ఈఎంయూ
- సూళ్లూరుపేట-నెల్లూరు(66037) మెము
- నెల్లూరు-సూళ్లూరుపేట(66038) మెము.
- చెన్నై- గుమ్మిడిపూడి ఈఎంయూ
- గుమ్మిడిపూడి-చెన్నై ఈఎంయూ

కల్వర్టుల విస్మరణతో ముంపు ముప్పు



మూసివేసిన కల్వర్టు ఎదురు రోడ్డువైపు కల్వర్టు నిర్మాణం- నిరుపయోగమైన కల్వర్టు

నాయుడుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు-తిరుపతి జాతీయ రహదారిలో నాయుడుపేట సర్కిల్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించినా గతంలో అక్కడ ఉన్న కల్వర్టులను విస్మరించారు. ఒక కల్వర్టు పూర్తిగా మూసివేయగా దానికి ఎదురుగా ఉన్న రహదారి వద్ద కల్వర్టు నిర్మించారు. మరోచోట కల్వర్టు నిరుపయోగంగా, చిన్నదిగా నిర్మించారు. అక్కడ నుంచి నీరు వెళ్లే మార్గం లేకుండా రోడ్డుకు మరోవైపు పూర్తిగా మూసివేశారు. గతంలో ఉన్న పైప్‌లైన్లనూ తీసివేశారు. వర్షాలు వస్తే నాయుడుపేట-విన్నమాల హైవే సర్కిల్ వద్ద ఉత్తరం వైపు పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. అధికారులకు తెలిపినా చర్యలు చేపట్టలేదని స్థానికులు, రైతులు వాపోతున్నారు. విన్నమాల హైవే సర్కిల్ వద్ద డీఎస్పీ, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, డివిజనల్ సబ్ ట్రెజరీ, తహసీల్దారు వంటి కార్యాలయాలు కూడా ఉన్నాయి. భారీ వర్షాలు వస్తే ఈ ప్రాంతంలో పంట మునిగిపోయే ప్రమాదం ఉంది. పాత కల్వర్టుల ద్వారా నీరు పారేలా చూడాలని కోరుతున్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యం


క్యాన్సర్ పరీక్ష చేస్తున్న డాక్టర్

బాలాయపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి వైద్యం అందిస్తే నివారణ సాధ్యమవుతుందని వైద్యాధికారి లియోనా అన్నారు. గురువారం గొట్టికాడు, నిండలి పంచాయతీల్లో తిరుపతి సిమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సుల ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రొమ్ముక్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలలో నివారించవచ్చునన్నారు. 35 ఏళ్లు దాటిన ప్రతిమహిళ మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవడం మంచిదన్నారు. సుమారు 100 మందికి పరీక్షలను నిర్వహించారు. జూన్ న జయంపు, పెరిమిడి గ్రామాల్లో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు హరిత, చైతన్యభాను, సర్పంచులు కృష్ణయ్య, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

స్వర్గధామం అభివృద్ధి పనులకు రూ.4లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న శ్రీనివాసులు

నాయుడుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట హిందూ స్మశానవాటిక స్వర్గధామం అభివృద్ధి పనుల కోసం సోల్లేటి శ్రీనివాసులు గురువారం రూ.4 లక్షలు హిందూ ధర్మసేవాసంఘం కన్వీనర్ కామిరెడ్డి రాజారెడ్డి, నాయకులకు అందజేశారు. తన భార్య ప్రవీణ జ్ఞాపకార్థంగా నగదు అందజేస్తున్నట్లు శ్రీనివాసులు తెలిపారు. ఈ సొమ్ముతో అదనపు గదిని నిర్మించనున్నట్లు హిందూ ధర్మసేవా సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో హిందూ ధర్మసేవాసంఘ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, పీడీ ఉదయశంకర్, కృష్ణారావు, శశిధర్, చంద్రారెడ్డి, ఎన్. కుమార్, కోటేశ్వర రావు ఉన్నారు.

యోగా చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ


ప్రతిభ కనపరచిన విద్యార్థులతో ఎంఈవో మునిరత్నం

నాయుడుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్రలో భాగంగా గురువారం అన్నమేడులో విద్యార్థులకు పలు ఆసనాలను యోగా శిక్షకుడు విద్యార్థులకు నేర్పించారు. ఆసనాలపై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనపరచిన విద్యార్థులను ఎంఈవో మునిరత్నం అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, యోగా శిక్షకుడు ఎన్ సుబ్రహ్మణ్యం, లక్ష్మీ, నరసమ్మ, కార్యదర్శి చిట్టేటి గోవిందమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలో గురువారం ప్రజలకు యోగా ఉపయోగాల గురించి అధికారులు వివరించారు. యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు కూడా నియంత్రించవచ్చునని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా చెప్పారు.

రేషన్ దుకాణాల ఆకస్మిక తనిఖీ


రేషన్ దుకాణంలో తనిఖీచేస్తున్న తహసీల్దార్

కోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుపల్లి కొత్తపాళెం, చెందోడు, జరుగుమల్లి, కొక్కుపాడు, తిమ్మానాయుడుపాళెం గ్రామాల్లోని రేషన్ దుకాణాలను గురువారం తహసీల్దార్ జయజయరావు తనిఖీ చేశార్లు వసతులు, కాటాల కొలతలను స్వయంగా పర్యవేక్షించి డీలర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరావు, వీఆర్‌ఓలు ఉన్నారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయంలో డీలర్లు, వీఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. **తడ** : అవకతవకలు తావివ్వకుండా పక్కాగా రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దారు శరత్‌బాబు ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తూకం యంత్రాలు, బయోమెట్రిక్ మిషన్లు పక్కాగా ఉంచుకోవాలన్నారు. సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య, వనజ, వీఆర్వోలు పాల్గొన్నారు.

భూసేకరణపై జేసీ బన్సల్ ఆరా


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న సమితి సభ్యులు

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): ఇరగలం, రాళ్లకుప్పం గ్రామాల్లో భూ సేకరణ పై జేసీ శుభం బన్సల్ గురువారం ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో చర్చించారు. ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో భూ సేకరణ సత్యవేడు తహశీల్దార్ రాజశేఖర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సజావుగా సేకరించాలన్నారు. ఈ సందర్భంగా జేసీకి అంబేడ్కర్ సేవా సమితి సూళ్లూరులో సర్వే నెంబరు93/31లో 1965 నుంచి నివాసం ఉంటున్న వారికి పొజిషన్ సర్టిఫికేట్స్ ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. అధికారులతో చర్చించి న్యాయం చేస్తానని ఆయన వారికి హామి ఇచ్చారు. తహశీల్దార్ ఎస్‌వీ నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి నివాళి

కోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస సత్రం సమీపాన సముద్రంలో గల్లంతై మృతి చెందిన 7వ తరగతి విద్యార్థిని పల్లవి మతదేహం వద్ద గురువారం గూడూరు బీసీ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ అంజనమ్మ, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. ఎర్రావారిపాళెం మండలం ఉదయమాణిక్యం బీసీ బాలికల గురుకులంలో 7వ తరగతి చదువుతున్న పల్లవి బుధవారం స్వగ్రామం శ్రీనివాససత్రం వచ్చి ప్రమాదవశాత్తూ సముద్రంలో దిగి మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆమె తల్లిదండ్రులు లక్ష్మయ్య, సౌమ్యలకు ఉపాధ్యాయులు ధైర్యం చెప్పారు.

తేనెటీగల దాడి

కోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని బజాజ్ షోరూం సెంటర్‌లో గురువారం కొండ తేనేటీగలు పాదచారులపై దాడి చేశాయి. రెండు రోజులుగా ఈ ప్రాంతంలో ఇవి దాడి చేస్తుండడంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. ఇక్కడ చెట్లపై తేనేటీగ తొట్టెలు ఎక్కువగా ఉండడంతో అక్కడ ఈగలు వాహన చోదకులపై తెగబడుతుండటంతో బాధితులు చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పరుగులు తీస్తున్నారు.

కోటమ్మకు గోదానం

కోట, మే 29 (ఆంధ్రజ్యోతి) : కోట గ్రామ దేవత కోటమ్మకు గురువారం పట్టణానికి చెందిన ప్రసాద్ గోవును దానం చేశారు. ఆలయ ధర్మకర్త నల్లప్పరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి,కవితమ్మ దంపతులకు గోవును అప్పగించారు. ఆలయంలో గోపూజ చేశారు.

పంటకాలువ పూడికతీత


పనులను పర్యవేక్షిస్తున్న ఫజులుల్లా

నాయుడుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం విన్నమాల పంటకాలువ పూడికతీత పనులను గురువారం చేపట్టారు. పంటకాలువ దాదాపు ఎక్కువ ప్రాంతం పట్టణంలో ఉండటంతోపాటు స్వర్ణముఖినది నుంచి నీటి పారుదల సక్రమంగా లేకపోవడంతో మురికికూపంలా తయారైంది. ఈక్రమంలో ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులను చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా పర్యవేక్షించారు.

చెంగాళమ్మ సేవలో హైకోర్టు ప్రధాన కార్యదర్శి


హైకోర్టు ప్రధాన కార్యదర్శికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని గురువారం ఏపీ హైకోర్టు ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆయనకు సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో పూజలనంతరం ఆస్థాన మండపంలో వేదపండితుల ఆశీర్వచనంచేసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

మహానాడుకు ఉత్సాహంగా తరలిన టీడీపీ శ్రేణులు

సూళ్లూరుపేట, మే 29 (ఆంధ్రజ్యోతి): కడప మహానాడుకు గురువారం సూళ్లూరుపేట నుంచి టీడీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. పట్టణం, రూరల్ కమిటి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆరు బస్సుల్లో వెళ్లారు. టీడీపీ నాయకులు సుబ్రమణ్యం, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, ఏలిమేటి సతీష్, వంకా రమేష్ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు వెళ్లారు. మండల పార్టీ అధ్యక్షుకు కొక్కు శంకరయ్య ఆధ్వర్యంలో తెల్లవారుజామున గ్రామీణ ప్రాంతాల నుంచి వెళ్లారు.

నాయుడుపేట : గోమతి సెంటర్ వద్ద మహానాడుకు టీడీపీ శ్రేణులు వెళ్తున్న వాహనాలకు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, నెలవల రాజేష్, మధుసూదన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీరామ్‌ప్రసాద్, దార్ల రాజేంద్ర, అవధానం సుధీర్, షైలారి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

గూడూరు: మహానాడు బహిరంగసభకు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 60 బస్సులు, 40 టెంపోలు, కార్లు, ఇతర వాహనాల్లో 5వేల మంది తరలివెళ్లారు. చిల్లకూరు మండలం నుంచి టీడీపీ సీనియర్ నాయకులు తానంకి నానాజీ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు.

ఓజిలి: మండలం నుంచి వందలాదిగా తెలుగు తమ్ముళ్లు మహానాడుకు కదిలారు. మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు అద్వర్యంలో ఓజిలి క్లస్టర్ ఇన్‌చార్జి కంకణాల సత్యవరప్రసాద్‌రావు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య నేతృత్వంలో ఓజిలితోపాటు మండలం నుంచి పసుపు సైన్యం బయలుదేరింది. **బాలాయపల్లి:** మండలపార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు ఆధ్వర్యంలో 10 బస్సులు 5 కార్లలో బయలుదేరి వెళ్లారు. **పెళ్లకూరు** : మహానాడు సభకు టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య అధ్వర్యంలో వాహనాల్లో పార్టీ శ్రేణులు వెళ్లాయి. మహానాడు ప్రాంగణంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని నాయకులు, కార్యకర్తలు కలిశారు. సభకు భారీగా నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంపై ఎమ్మెల్యే అభినందించారు.






మహానాడు సభ వద్ద ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌తో తెలుగు యువత నాయకులు-చిల్లకూరు నుంచి వెళుతున్న టీడీపీ నేతలు- ఎమ్మెల్యే విజయశ్రీతో పెళ్లకూరు మండల టీడీపీ నాయకులు- మహానాడుకు బయలుదేరిన ఓజిలి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు